


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :124 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు బుధవారం 8 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 124 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE WED 8 JANUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## అప్పుడందరూ వెతుక్కుంటూ
# కుప్పం వస్తారు

- కుప్పంలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- వివిధ నిర్మాణాలకు శంకుస్థాపన
- అనంతరం 'స్వర్ణ కుప్పం' సభకు హాజరు
- కుప్పం వచ్చే ప్రజల ఆయుష్షు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్న చంద్రబాబు
- 2047 నాటికి కుప్పంను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గం చేస్తామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:సొంత నియోజకవర్గం కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన నేడు రెండో రోజు కూడా కొనసాగింది. కుప్పం లో పలు నిర్మాణ పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాల భూమిపూజలో పాల్గొన్నారు. కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన 'స్వర్ణ కుప్పం' సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ... రానున్న 23 ఏళ్లలో కుప్పం భారతదేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంలా ఉండాలని అన్నారు. ఎవరన్నా చదువుకోవాలంటే బెంగళూరుకు వెళ్లడం కాదు, కుప్పానికి రావాలి... అలాంటి విద్యాసంస్థలను ఇక్కడికి తీసుకువస్తామని వివరించారు. ఇవన్నీ కాకుండా, అత్యంత నివాసయోగ్యమైన ప్రదేశంగా కుప్పంను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కుప్పానికి వచ్చే ప్రజలకు ఆరోగ్యం పెరగాలి... సాధారణంగా బెంగళూరు కంటే కుప్పం వచ్చే వాళ్లకు 20-30 ఏళ్లు ఎక్కువగా ఆయుష్షు పెరిగే పరిస్థితి వస్తే... అప్పుడందరూ వెతుక్కుంటూ కుప్పానికి వస్తారు అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంత పరిశుభ్రమైన ప్రాంతంగా కుప్పంను తయారు చేస్తాం అని స్పష్టం చేశారు. అందుకు మీ అందరి సహకారం అవసరం అని అన్నారు. అంతేగాకుండా, కుప్పంను ఒక టూరిస్ట్ హబ్ గా మార్చుతామని, వీకెండ్ లో బెంగళూరు నుంచి ఇక్కడికి వచ్చేలా చేస్తామని చెప్పారు. ఇక, నిడమూరులో ఇళ్లపై సోలార్ కరెంటు ఉత్పత్తికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యం బాగా విస్తరించాల్సిన అవసరం ఉందని, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు మంచి ధర వస్తుందని అన్నారు. మైక్రో కిరాణా దుకాణాల యజమానులకు లాభాలు రావాలని ఆకాంక్షిస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. టాటా సంస్థ సహకారంతో అందరికీ అధునాతన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

- గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
- మంత్రి లోకేశ్ సమక్షంలో స్వనీతి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఓయూ
- పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో స్వనీతి ఇనిషియేటివ్ సంస్థకు గొప్ప అనుభవం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కీలక ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ మేరకు ఎంఓయూ కుదిరింది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపరిచి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో అనుభవం కలిగిన స్వనీతి ఇనియేటివ్ సంస్థ సమాజంలో వెనుకబాటుకు గురైన వారి జీవితాల్లో మార్పు కోసం కృషిచేస్తోంది. స్కిల్లింగ్‌కు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది.

వివరాలు 2లో..

## ఆ తల్లి ఆవేదనకు బదులిచ్చే ధైర్యం ఉందా పవన్ కల్యాణ్?

- ఇటీవల రాజమండ్రిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్
- ఈవెంట్ నుంచి తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- పవన్ కల్యాణ్ పై మండిపడుతున్న వైసీపీ నేతలు



పెన్ పవర్ డెస్క్:రాజమండ్రిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హాజరై తిరిగి వెళుతున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువా తపడడం తెలిసిందే. ఈ సినీ ఈవెంట్ కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరైన నేపథ్యంలో, వైసీపీ నేతలు ఆయనను టార్గెట్ గా చేసుకుని

వివరాలు 2లో..

## ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు ఆపేశాయి

- పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విడదల రజని
- ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని విమర్శ
- ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:పేదల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు సంజీవనిలాంటిదని చెప్పారు. ఆరోగ్యశ్రీని రాజశేఖరరెడ్డి తీసుకొచ్చారని... ఆ పథకాన్ని జగన్ మరింత బలోపేతం చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ను ప్రస్తుత

వివరాలు 2లో..

## ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



- సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల వ్యవహారం
- అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిపై అభియోగాలు
- రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు
- పులివెందులలోని అతడి నివాసంలోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, అనితలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల వ్యవహారంలో వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు.

వివరాలు 2లో..

## ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ

- ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని రాజకీయ పార్టీల ఆరోపణలు
- మీడియా ముందుకువచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్
- ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఇవాళ ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ అని స్పష్టం చేశారు. ఈవీఎంలు అత్యంత భద్రతతో కూడినవని, ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని పేర్కొన్నారు. ర్యాండమ్ గా వీవీ ప్యాట్ లలోని స్లిప్పులను లెక్కిస్తున్నామని,




వివరాలు 2లో..

## హెచ్ఎంపీవీ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

- హెచ్ఎంపీవీని తేలిగ్గా తీసుకోవద్దన్న ప్రతిపక్ష బీజేపీ నేత అశోక
- ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దనే ఉద్దేశంతో మంత్రి మాట్లాడారన్న బీజేపీ నేత
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందని వెల్లడి

హెచ్ఎంపీవీ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దని కర్ణాటక బీజేపీ హెచ్చరించింది. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదవుతున్నాయి. బెంగళూరులో ఇద్దరు చిన్నారులకు పాజిటివ్ అని తేలింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రతిపక్ష నేత (బీజేపీ)

వివరాలు 2లో..



## గరికపాటిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం.. చర్యలు తీసుకుంటామన్న గరికపాటి టీమ్



- యూట్యూబ్ ఛానళ్లు, కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారన్న గరికపాటి టీమ్
- వీటిని ఖండిస్తున్నామని వెల్లడి
- పరువునష్టం కేసులు వేస్తామని హెచ్చరిక

వివరాలు 2లో..

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు బెయిల్ నిరాకరణ

- మరియమ్మ హత్య కేసులో జైలుపాలైన మాజీ ఎంపీ
- బెయిల్ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ట్రయల్ కోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీం బెంచ్



పెన్ పవర్ డెస్క్:మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్ కు సుప్రీంకోర్టు షాకిచ్చింది. సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మరియమ్మ హత్య కేసులో పోలీసులు నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. బెయిల్ కోసం నందిగం సురేశ్ ట్రయల్ కోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్ ను కోర్టు

వివరాలు 2లో..

## ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఖాయం


- అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి జరుగుతున్న పోరు అని వ్యాఖ్య
- పార్టీ శ్రేణులు పూర్తి సామర్థ్యంతో సిద్ధం కావాలని పిలుపు
- ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అభివృద్ధి పట్ల ఓటర్లు విశ్వాసంతో ఉన్నారన్న మాజీ సీఎం

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ ప్రజలు అభివృద్ధి వైపే చూస్తారని, రాను న్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ విజయం ఖాయ మని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ధీమా

వివరాలు 2లో..



## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం... హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు




- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- బుద్ధ భవన్‌లోని బీ-బ్లాక్‌లో త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- ఇప్పటికే హైడ్రాకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ గెజిట్

వివరాలు 2లో..

## టిబెట్ పీఠభూమిలో భారీ భూకంపం... 95 మంది మృతి

7.1 తీవ్రతతో భారీ భూకంపం

నేలమట్టమైన భవనాలు

కొనసాగుతున్న సహాయక చర్యలు

భారత్ లోనూ ప్రకంపనలు



పెన్ పవర్ డెస్క్:శక్తిమంతమైన భూకంపం టిబెట్ ను కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదైన ఈ భూకంపం కారణంగా 95 మంది మృత్యువాత పడ్డారు. 130 మంది గాయపడ్డారు. నేపాల్ సరిహద్దుకు సమీపంలో టిబెట్ పీఠభూమిలో ఉదయం భూకంపం సంభవించింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ద్రవ్యోల్బణం, బలహీన రూపాయే అంశాలు

కరోనా తర్వాత ప్రపంచమంతా ఎదుర్కుంటున్న అత్యంత ప్రధాన సమస్య ద్రవ్యోల్బణం. భారతదేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని చెబుతున్నప్పటికీ.. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి అవసరం చాలా ఉంది. ఎందుకంటో, 2024 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 14-నెలల గరిష్ఠ స్థాయి 6.21%కి చేరుకుంది. ఆహార ద్రవ్యోల్బణం 15-నెలల గరిష్ఠ స్థాయి 10.87%కి చేరుకుంది. 2023లో, గృహస్తుల ద్వారా వచ్చే పొదుపులు 50 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. నగరాల్లో నివశిస్తున్న సగానికి పైగా జనం అప్పులతోనే జీవితాన్ని గడుపుతున్నారుపేదరికం తగ్గిందని చెబుతున్నప్పటికీ.. అప్పుల భారం సామాన్యుణ్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదు. ఇలాంటి నేపథ్యంలో.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంది. అది ఎంత త్వరగా జరిగితే.. దేశంతో పాటు రాష్ట్రాలు కూడా బాగుపడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఉఆఖ వృద్ధి చెందేలా చేయాలి. 2024 డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉఆఖ వృద్ధి అంచనాలను 7.2% నుండి 6.6%కి తగ్గించింది. రెపో రేటును వరుసగా పదకొండు పర్యాయాలు తగ్గించలేదు. ప్రపంచంలోనే మూడో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ టార్గెట్ సరిపోదన్నది ప్రధానికి తెలియని విషయం కాదు.దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించండం ప్రధాన సవాలుగా ఉంది. అయితే 2022-23, 2023-24 మధ్య 13 వేల కోట్ల రూపాయల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయని లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు, ఎలన్ మస్క్ లాంటి కుబేరుడు భారత్‌లో పెట్టుబడి పెడతామని చెప్పి, తర్వాత తత్సారం చేయడం ప్రారంభించారు. భారత్ పర్యటనను రద్దు చేసుకోని, చైనా వైపు చూపు తిప్పారు. ఇంకోవైపు, అదానీ, అంబానీల ఆస్తి గ్రాఫ్ కూడా ఇటీవల తగ్గు మొహం పట్టింది.భారత ప్రధాని మోదీ తీరిక లేకుండా విదేశీ పర్యటనలు చేస్తున్నప్పటికీ.. అనుకున్నంతగా విదేశీ పెట్టుబడులను భారత్ ఆకర్షించలేకపోతోంది. అమెరికాలో అధికార పీఠం ఎక్కబోతున్న డొనాల్డ్ ట్రంప్ చూస్తే.. టారిఫ్‌లతో అటాక్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మోడీ బాధ్యత మరింత పెరిగింది. అంతర్జాతీయంగా భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగాలంటే.. రూపాయిని కూడా బలోపేతం చేయాల్సి ఉంది. 2024 డిసెంబర్‌లో.. రూపాయి మూడవ వరుస సెషన్‌లో బలహీనంగా మారింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే 85.27 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయి వద్ద స్థిరపడింది. ఈ నేపథ్యంలో.. మోదీ ముందున్న పెద్ద సవాలు రూపాయిని బలోపేతం చేయడమే!ఇక, దేశంలో పేదరికం తగ్గుతుందని నివేదికలు వస్తున్నప్పటికీ.. నిరుద్యోగం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందుకే, మోదీ ప్రభుత్వం అర్జెంట్‌గా ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంది. గత రెండేళ్లుగా 10% వద్దే చతికిలపడిన యువత నిరుద్యోగం రేటును ఈ ఏడాది అయినా మెరుగుపర్చాల్సి ఉంది. ఎకనామిక్ సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం యువతలో సగం మంది కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పోస్ట్‌మ్యాన్ ఉద్యోగాలకు కూడా పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ హోల్డర్లు దరకాస్తు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఒక విధంగా, దేశంలో చాలా మంది చదువుకు సంబంధించిన ఉద్యోగాలు చేయలేకపోతున్నారు.

స్వయం ఉపాధిని ఆశ్రయిద్దామనుకున్నా.. కార్పొరేట్ సంస్థలు వచ్చి చిన్నపాటి వ్యాపారాలను కూడా నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించాలంటే.. ప్రభుత్వం సామాన్యులకు మేలు చేసే విధంగా విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. గత నాలుగేళ్లలో పారిశ్రామిక రంగానికి రూ.5.65 లక్షల కోట్లు రుణమాఫీ చేశారు. దేశంలోని అతిపెద్ద ఉపాధి సంస్థ వ్యవసాయం, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌ల నుండి అన్ని రంగాల్లో రుణాల రద్దు విషయంలో అతి తక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. కాబట్టి, ఈ సంవత్సరమైనా కేంద్రం ఉద్యోగ కల్పన నుండి స్వయం ఉపాధిలో సామాన్యుడికి సహకరించాల్సి ఉంది.ఈ ఏడాది, ఏటా 17 లక్షల మంది భారతీయులకు ఆహార కొరత మోదీ ప్రభుత్వం ముందున్న అత్యంత ముఖ్యమైన సవాలు అందరికీ ఆహారాన్ని అందించండం. ఏటా 17 లక్షల మంది భారతీయులు తగినంత ఆహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్నట్లు నివేదికలు ఉన్నాయి. 2013 నుండి భారతదేశం ఉఆఖలో 50% పెరిగినప్పటికీ.. ప్రపంచంలోని పోషకాహార లోపం ఉన్న పిల్లలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది భారతదేశంలో నివసిస్తున్నారు. వీరిలో మూడేళ్లలోపు పిల్లల్లో సగం మంది తక్కువ బరువుతో ఉన్నారు.భారతదేశంలో పోషకాహార లోపానికి ప్రధాన కారణాలలో ఆర్థిక అసమానత ఒకటి. జనాభాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఆర్థిక స్థితి కారణంగా, వారి ఆహారంలో తరచుగా నాణ్యత లోపం, పరిమాణంలోనూ తక్కువ ఉంటోంది. ఇలా పోషకాహార లోపం ఉన్న స్త్రీలకు ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టే అవకాశం తక్కువ. అధిక పోషకాహారం తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. భారతదేశంలో జాతీయ స్థూలకాయం రేట్లు 2010లో స్త్రీలకు 14%, పురుషులకు 18%గా ఉంది. కొన్ని పట్టణ ప్రాంతాలలో 40% కంటే ఎక్కువగా ఉంది. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులకు కారణమవుతుంది.మరోవైపు, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులతో.. సమాజానికి దీర్ఘకాలిక నష్టం ఉంది. మంచి ఆహారం తీసుకునే వారితో పోలిస్తే, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు న్యుమోనియా, క్షయ వంటి అంటు వ్యాధులకు లోనవుతారు. ఇది అధిక మరణాల రేటుకు దారితీస్తుంది. అంతేకాకుండా, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు పనిలో తక్కువ ఉత్పాదకతను కలిగి ఉంటారు. తక్కువ ఉత్పాదకత వారికి తక్కువ వేతనాన్ని అందించడమే కాకుండా వారిని పోషకాహార లోపం అనే విష వలయంలోకి నెడుతుంది.అందరికీ సమాన వేతనాలు ఉండేలా చూసుకోవడం వల్ల అందరూ మంచి ఆహారాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. గత దశాబ్దంలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ వాస్తవ వేతనాలు 0.4% తగ్గాయి. అలాగే, వ్యవసాయ వేతనాలు 0.2% వద్ద నిలిచిపోయాయి. ఐదుగురిలో నలుగురు వ్యక్తులు 2021 నాటికి రూ.515 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. అయితే, సామాజిక-ఆర్థిక సంక్షేమంలో మెరుగుదల ఉంటే.. పిల్లల పోషకాహారం కూడా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు కూడా భావిస్తున్నారు. కాబట్టి, దేశంలో ప్రజల ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక స్థితి మెరుగుపడాలన్నా మోడీ ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.ఇక, దేశంలో అట్టడుగున ఉన్నవారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది. ఇందులో భాగంగా.. ముఖ్యంగా, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధాన్ని సరిగ్గా అమలు చేయాల్సి ఉంది. మాన్యువల్ స్కావెంజింగ్ 2013లో నిషేధించబడినప్పటికీ.. 2018-2020 మధ్య, మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం వల్ల 443 మంది మరణించారు. ఇక, మోడీ పాలనలో నిజానిజాలను బయటకు తీసుకొచ్చే జర్నలిస్టుల మీద దాడులు మరింత పెరిగాయన్నది స్పష్టంగా లెక్కలు చెబుతున్న వాస్తవాలు.2019 నుండి.. 100 బిల్లులు, రెండు గంటలలోపే ఆమోదించబడ్డాయి. 17వ లోక్‌సభలో, పార్లమెంటులో ప్రవేశపెట్టిన 10 బిల్లుల్లో 9 బిల్లులపై ఎవర్నీ సంప్రదించలేదు.. ఒక వేళ ఏదైనా చర్చ సాగినా అది అసంపూర్తిగానే మిగిలింది. ఇలా, ఏకపక్షంగా బిల్లులు ఆమోదించిన ఘనత మోడీకి దక్కిందని విపక్షాలతో పాటు ప్రజా సంఘాలు కూడా దుమ్మెత్తి పోశాయి. అయినా, పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఈ ఏడాది జరిగే లోక్ సభ సమావేశాల్లో అయినా సక్రమంగా జరుగుతుందోమో చూడాలి.ఇక, సురక్షితమైన ప్రజా మౌలిక సదుపాయాలపై కూడా విమర్శలు లేకపోలేదు. 2017-2022 మధ్య 244 రైలు ప్రమాదాలు జరిగాయి. మోర్బిలో వేలాడే వంతెన కూలిపోవడంతో 135 మంది మరణించారు. ఉత్తరకాశీ టన్నెల్‌లోకి ప్రవేశించిన తర్వాత 41 మంది కార్మికులు 17 రోజుల పాటు చిక్కుకుపోయారు. దీనికి తోడు.. దేశంలో సురక్షితమైన ఇంటర్నెట్ లోపం కారణంగా.. 2024 మొదటి తొమ్మిది నెలల్లో "డిజిటల్ అరెస్టులకు" సంబంధించిన మోసాలు రూ.1616 కోట్ల విలువైన నష్టాలను చూశాయి.ఏడాది క్రితం చట్టం ఆమోదించబడినప్పటికీ డిజిటల్ డేటా రక్షణ నియమాలు నోటిఫై చేయలేదు. ఇవన్నీ మోదీ ప్రభుత్వంపై కేవలం విమర్శలు మాత్రమే కాదు. ఇది మోదీ ప్రభుత్వం ఎదుర్కుంటున్న సవాళ్లు కూడా. మూడో టర్మ్‌లో ఆరు మాసాలు దాటిపోయిన కేంద్ర ఎన్డీయే ప్రభుత్వం, వీటన్నింటిపై ఇప్పుడు ధ్యాస పెట్టాల్సి ఉంది. మరి, ఈ కొత్త సంవత్సరంలో మోదీ ఈ సమస్యలను పరిష్కరిస్తారో లేదో చూడాలి.

# గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

- మొదటి పేజీ తరువాయి

కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్‌ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది.

ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్ మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేశ్ కుమార్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ప్రకారం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ వచ్చే 4 నెలల్లో పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి వ్యూహం ముసాయిదాను రూపొందించి, వ్యూహం అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందుకోసం రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్ కోసం స్కిల్ ల్యాండ్ స్కేప్ అసెస్ మెంట్ చేస్తుంది. కీలకమైన వాటాదారులతో (పరిశ్రమ, పరిశ్రమ సంఘాలు, క్లస్టర్ సంఘాలు, శిక్షణా సంస్థలు – ఐటీఐలు, వీటీసీ, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు మొదలైనవి) సంప్రదింపులు జరిపి నివేదిక రూపొందిస్తుంది.

జర్మనీ, అమెరికా బృందాలు, సెక్టార్ నిపుణులు, గ్రీన్ ఎనర్జీ రంగ నిపుణుల ఆలోచనలను పంచుకునేందుకు కీలకమైన భాగస్వాములతో వర్క్‌షాప్‌లు కండక్ట్ చేస్తుంది. కీలక వాటాదారుల భాగస్వామ్యంతో వ్యూహాన్ని ఖరారు చేస్తుంది. ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ... తమ ప్రధాన కార్యాలయం నుంచి పని చేసే స్వనీతి బృందానికి ప్రత్యేకంగా నైపుణ్య గణన, ఇన్ సైట్ ఇన్ఫర్మేషన్, గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమాచారం అందిస్తుంది. టెక్నికల్ కన్సల్టెంట్లు ఏపీఎస్ఎస్‌డీసీ తాడేపల్లి కార్యాలయంలో పనిచేయడానికి అవసరమైన స్థలాన్ని అందిస్తుంది. అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన ప్రభుత్వ శాఖల విశ్లేషణలు, వారితో సంప్రదింపుల కోసం సంబంధిత ప్రభుత్వ శాఖల యాక్సెస్ ఇచ్చి, సంబంధిత సమాచారాన్ని అందిస్తుంది.

### స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ చేపట్టే కార్యక్రమాలు

1. అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరులలో గ్రీన్ ఉద్యోగాల కల్పనకు గల అవకాశాలను అంచనా వేయడానికి బేస్‌లైన్ సర్వే నిర్వహిస్తుంది. అలాగే కాకినాడ, గోదావరి, వైజాగ్‌లలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ, సంబంధిత నైపుణ్య అవకాశాలను కూడా అంచనా వేస్తుంది.
2. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ బాధ్యతలను వివరిస్తూ భవిష్యత్తు అభివృద్ధి అంచనాలను రూపొందిస్తుంది.
3. గ్రీన్ స్కిల్లింగ్ రంగంలో అభివృద్ధికి అనుగుణంగా ఏమేరకు మానవవనరులు అవసరమో గుర్తిస్తుంది.
4. గ్రీన్ ఎనర్జీ నైపుణ్య అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి అవసరమైన డేటా లేదా సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తుంది.
5. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అమలుచేస్తున్న గ్రీన్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను సమీక్షిస్తుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవసరమైన విద్యా కార్యక్రమాలను అన్వేషిస్తుంది.
6. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, స్కిల్ హబ్‌లు, స్కిల్ స్పోక్స్ మొదలైన వాటిలో పరిశ్రమల అలైన్డ్ ట్రైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడానికి ప్రోగ్రామ్ రూపకల్పనలో మద్దతునిస్తుంది.
7. నైపుణ్య శిక్షణ, ఉపాధికి సంబంధించి రాష్ట్రంలో సహకారాన్ని కలిగి ఉండటానికి జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమ సంస్థలతో అనుసంధానం చేయడంలో ఏపీఎస్ఎస్‌డీసీకి మద్దతునిస్తుంది.
8. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్షించి పబ్లిక్, నిరుద్యోగ యువత, నైపుణ్యం కలిగిన అభ్యర్థుల ఉపాధి కోసం పరిశ్రమతో పాటు లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ తో అనుసంధానానికి ప్రణాళిక తయారీలో కీలకమైన ఇన్‌పుట్‌లను అందిస్తుంది.
9. సూచికల ప్రస్తుత స్థితి, పురోగతిని సమీక్షించడానికి సమగ్ర ప్రభావ అంచనాలను రూపొందిస్తుంది.
10. స్కిల్ అసెస్‌మెంట్, మ్యాపింగ్‌లో పేరొందిన ప్రీమియర్ అకడమిక్ ఇన్‌స్టిట్యూట్‌ల భాగస్వామ్యంతో అనుభవజ్ఞులైన సాంకేతిక కన్సల్టెంట్‌లను నియమిస్తుంది.

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు బెయిల్ నిరాకరణ

- మొదటి పేజీ తరువాయి

తోసిపుచ్చింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. మాజీ ఎంపీ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం తీర్పు చెబుతూ.. తనపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను దాచారనే కారణంతో ట్రయల్ కోర్టు నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్ తిరస్కరించిందని గుర్తుచేసింది. దీంతో ట్రయల్ కోర్టు ఆదేశాలలో తాము కల్పించుకోబోమని పేర్కొంటూ మాజీ ఎంపీ బెయిల్ పిటిషన్ ను తోసిపుచ్చింది.

**మరియమ్మ హత్య కేసు..**

తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన ఎస్సీ మహిళ మరియమ్మ 2020లో హత్యకు గురైంది. అప్పట్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ తమను మోసం చేశారని మరియమ్మ బహిరంగంగా దూషించింది. తనకు పెన్షన్ ఆపేశారని, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని మండిపడింది. దీంతో నందిగం సురేశ్ అనుచరులు మరియమ్మ ఇంటిపై దాడి చేశారు. మరియమ్మను తీవ్రంగా కొట్టి చంపేశారు. ఫిర్యాదు చేసినా అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదని, కేసును పక్కన పెట్టారని మరియమ్మ కుమారుడు ఆరోపించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేశ్ ను కలిసి న్యాయం చేయాలంటూ మరియమ్మ కుమారుడు విజ్ఞప్తి చేశాడు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో కేసు దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు.. మాజీ ఎంపీ నందిగం సురేశ్ ను అరెస్టు చేసి జైలుకు పంపించారు.

## ఆ తల్లి ఆవేదనకు బదులిచ్చే ధైర్యం ఉందా పవన్ కల్యాణ్?

- మొదటి పేజీ తరువాయి

విమర్శనాస్త్రాలు సంధించారు.

తాజాగా, మాజీ మంత్రి రోజా కూడా పవన్ కల్యాణ్ పై ధ్వజమెత్తారు. మృతుల్లో ఒకరి తల్లి తీవ్రంగా రోదిస్తున్న వీడియోను ఎక్స్ లో పోస్టు చేసిన రోజా.... కన్నబిడ్డను కోల్పోయిన ఆ తల్లి ఆవేదనతో అడుగుతున్న ప్రతిమాటకు సూటిగా బదులిచ్చే ధైర్యం ఉందా పవన్ కల్యాణ్? అని ప్రశ్నించారు. ఆత్మ పరిశీలన చేసుకోండి... అధికారమదంతో కాకుండా మానవత్వంతో మాట్లాడండి! అంటూ రోజా ట్వీట్ చేశారు.

## ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఖాయం

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతున్న పోరు అన్నారు. నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ... ఎన్నికల తేదీలు వచ్చాయని... పార్టీ శ్రేణులు పూర్తి సామర్థ్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పదేళ్లలో ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అభివృద్ధి పట్ల ఓటర్లు పూర్తి విశ్వాసంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. అందుకే వారు తమ పార్టీ వైపే చూస్తారని భావిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే తమ బలమన్నారు. కార్యకర్తల బలం ముందు ప్రతిపక్ష వ్యవస్థలన్నీ విఫలమవుతాయన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు ఆపేశాయి

- మొదటి పేజీ తరువాయి

ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.

ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ. 3 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని... బకాయిలను ప్రభుత్వం చెల్లించపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు ఆపేశాయని విడదల రజని అన్నారు. ఓటు వేసి గెలిపించినందుకు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. ప్రజల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిది కాదనే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.637 కోట్ల పాత ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని రజని డిమాండ్ చేశారు.

# టిబెట్ పీఠభూమిలో భారీ భూకంపం... 95 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

టిబెట్ లోని షిజాంగ్ నగరానికి సమీపంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్ జీఎస్) గుర్తించింది. ఒక్కసారిగా భూమి ఊగిపోవడంతో ప్రజలు ఇళ్లలోంచి పరుగులు తీశారు. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. భారీ భూకంపం తర్వాత టిబెట్ భూభాగంలో భూమి దాదాపు 50 సార్లు కంపించింది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5కి లోపే నమోదైంది. కాగా, ఈ భూకంపం ప్రభావం భారత్ లోని ఉత్తరాది రాష్ట్రాల్లోనూ కనిపించింది. దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాలు, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. అటు, టిబెట్ లో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల తొలగింపు కొనసాగేకొద్దీ, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ

- మొదటి పేజీ తరువాయి

వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపులో ఇప్పటివరకు ఎక్కడా తేడా రాలేదని తెలిపారు. పోలింగ్ శాతం పెరుగుదలపైనా తప్పుడు ప్రచారం జరుగుతోందని అన్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి ఎంతో పోలింగ్ శాతం నమోదైందో ఒకసారి ప్రకటిస్తున్నామని రాజీవ్ కుమార్ తెలిపారు. పోలింగ్ సమయం ముగిశాక... అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారు ఓటేస్తున్నారని, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ జరుగుతోందని వెల్లడించారు. అందువల్ల పోలింగ్ శాతంపై చివరి లెక్కలు ఆలస్యంగా వస్తున్నాయని వివరించారు.

గత కొన్నేళ్లుగా ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ పార్టీలు ఈవీఎంలను నిందిస్తుండడం తెలిసిందే. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందంటూ పలు పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది.

## గరికపాటిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం.. చర్యలు తీసుకుంటామన్న గరికపాటి టీమ్

**పెన్ పవర్ డెస్క్:** కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, కొందరు వ్యక్తులు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన టీమ్ తెలిపింది. గరికపాటిపై వారు చేస్తున్న ఆరోపణలు అసత్యమని పేర్కొంది. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో ఆయన క్షమాపణలు చెప్పినట్టు, ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపింది. వీటిని తాము ఖండిస్తున్నామని... తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులపై పరువునష్టం కేసులు వేస్తామని హెచ్చరించింది. వీరి దుష్ప్రచారంతో గరికపాటి కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు కలత చెందుతున్నారని తెలిపింది.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం... హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని బుద్ధ భవన్ బీ-బ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది. హైడ్రాకు విస్తృత అధికారాలను కల్పిస్తూ ఇప్పటికే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.హైదరాబాద్ పరిధిలోని చెరువులు, ఇతర ఆస్తులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. అయితే, హైడ్రా ఏర్పాటుపై ప్రశ్నలు వచ్చాయి. దీంతో జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించారు. చెరువులు, ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ జీహెచ్ఎంసీ చట్టంలో 374 బీ సెక్షన్‌ను చేర్చారు.

## ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మొదటి పేజీ తరువాయి

అతడిని అరెస్ట్ చేసే అవకాశాలుండడంతో... వైసీపీ కార్యకర్తలు భారీగా పులివెందుల పోలీస్ స్టేషన్ వద్దకు తరలివచ్చారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డితో అసభ్య పోస్టులు పెట్టించాడని రాఘవరెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. అటు... ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులోనూ రాఘవరెడ్డి ఏ20 నిందితుడిగా ఉన్నాడు.

పులివెందులలోని రాఘవరెడ్డి నివాసానికి వెళ్లిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఏపీ హైకోర్టు రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ ను తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే, ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పులివెందుల పీఎస్ కు తరలించారు.

## హెచ్‌ఎంపీవీ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

- మొదటి పేజీ తరువాయి

ఆర్.అశోక మాట్లాడుతూ... ఈ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దన్నారు. కొత్త వైరస్ పట్ల ప్రజలు భయాందోళనకు గురికావొద్దనే ఉద్దేశంతో మంత్రి దినేశ్ గుండూరావు అదేమంత ప్రమాదకరం కాదన్న రీతిలో మాట్లాడారన్నారు.

దాని గురించి ఏమీ తెలియనప్పుడు హెచ్‌ఎంపీవీని తేలికగా తీసుకోరాదన్నారు. హెచ్‌ఎంపీవీ చైనాలో బీభత్సం సృష్టిస్తోందన్నారు. అక్కడి చిన్నారులు ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందన్నారు.వ్యాధి వచ్చినప్పుడు కాకుండా... రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ఈ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతోందన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎంపీవీని ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్ల లభ్యత, ఐసీయూ బెడ్ల వంటి సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# కనిగిరి తహశీల్దార్, వి.ఆర్.ఓ. సస్పెండ్

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

భూమి మ్యుటేషన్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన కనిగిరి తహశీల్దార్, వి.ఆర్.ఓ. ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. మ్యుటేషన్ అర్జీదారుని పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్.ఐ. పురుషోత్తమ్ రెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఈ నెల 4వ తేదీన కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. మ్యుటేషన్ చేయడానికి తహశీల్దార్ లంచం డిమాండ్ చేస్తున్నారంటూ దానికి సంబంధించిన ఫోన్ కాల్ రికార్డింగ్ సంభాషణను సదరు అర్జీదారుడు కలెక్టర్ కు వినిపించారు. దీనిపై కలెక్టర్ విచారణ చేయించారు. అర్జీదారుని నుంచి లంచం డిమాండ్, దురుసు ప్రవర్తన నిజమేనని ఉన్నతాధికారులు సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా తహశీల్దార్ ఆర్.ఐ., వి.ఆర్.ఓను కలెక్టర్ సస్పెండ్ చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# దొరికితే దొంగలు...లేకుంటే దొరలు..

**మండలంలో రెచ్చిపోతోన్న రేషన్ మాఫియా -లబ్ధిదారుల నుంచి డైరెక్ట్ గా కొనుగోలు**

**రైస్ మిల్లులకు తరలించి పాలీస్ చేసి ఇతర రాష్ట్రాల కు తరలింపు -గుట్టు చప్పుడు కాకుండా యధేశ్చగా దందా**

**దందాకు సహకరిస్తున్న రేషన్ డీలర్లు -బియ్యం సరఫరా కాకముందే టన్నుల కొద్దీ అమ్మకాలు**

**-నెల మామూళ్లు మత్తులో సంబంధిత అధికారులు -1 -రూ. 8 నుండి 10 రూపాయలు వరకు కొనుగోలు**




**వలేటివారిపాలెం పెన్ పవర్ జనవరి 7**

పేదల బియ్యాన్ని భోంచేసే వ్యాపారులు తమ అక్రమ వ్యాపారానికి సరికొత్త పంథా ఎంచుకున్నారు. లారీల్లో, ఆటోల్లో చౌక బియ్యం తరలిస్తుంటే అందరికీ అనుమానం వస్తుంది. అధికారులు దాడులు చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఈ బాధలు ఏమి లేకుండా ఏంచేయాలని ఆలోచించారు. వెంటనే సరికొత్త పన్నాగం వేశారు. ఎవరనుకుంటున్నారా వీళ్ళు రేషన్ మాఫీయా దొంగలు. ఇంకేముంది ఏకంగా పెద్ద పన్నాగంతో ప్లాన్ వేశారు. నఏమోహిపెడ్లను లైన్లో పెట్టారు. కొంతమంది వ్యక్తులను కూలీకి కుదుర్చుకుని మోపెడ్లపై నుంచి బియ్యం తరలించడం మొదలు పెట్టారు. వలేటివారిపాలెం మండలంలో నానాటికీ రేషన్ బియ్యం మాఫియా హెచ్చు మీరుతోంది. సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు పట్టుకోకుండా ప్రతి నెలా వారికి రేషన్ మాఫియా ముఠా మామూళ్లు ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో సంబంధిత శాఖల అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక అప్పుడప్పుడు ఎవరైనా నెల మామూళ్లు ఇవ్వకుంటే అప్పుడు వారిపై నిఘా పెట్టి పోలీసులకు సమాచారం అందించి పట్టిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇదంతా కూడా మండలంలోని అధికార పార్టీలోని కొందరు నేతలే బృందాలుగా ఏర్పడి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చాకచక్యంగా రేషన్ బియ్యం కొనుగోళ్లు ప్రభుత్వం రేషన్ దుకాణాల**

నుంచి వాహనాల ద్వారా బియ్యం తరలించే కార్యక్రమాన్ని నెలలో 15 వ తేదీ లోగా పూర్తి చేస్తున్నారు.కొందరు డీలర్లు అయితే 7, 8 వ తేదీనే గుట్టు చప్పుడు కాకుండా ఎత్తేస్తున్నారు. ఈ సమయంలో కొందరు రేషన్ మాఫియా ముఠా కొందరు కూలీలను నియమించి మరీ ఉదయం నుంచి సాయంత్రం దాకా అనుమానం రాకుండా బియ్యాన్ని ప్లాస్టిక్ గోతాల్లో మూటలు కట్టి మోపెడ్లపై, ఆటోల్లో తరలిస్తున్నారని తెలుస్తోంది. ఇలా ఒక్కో వాహనం ద్వారా రోజుకు నాలుగైదు ట్రిప్పులుగా బియ్యాన్ని చేరవేస్తున్నారనే విమర్శలు వినిపిస్తోన్నాయి. మొత్తంమీద పలు మోహిపెడ్లు, ఆటోలు అక్రమ రవాణాలో పాలుపంచుకుంటున్నా, ఈ తరహా తరలింపుపై ఎవరి దృష్టీ పడకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని కొందరు చెబుతున్నారు. ఈ బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలించిన తర్వాత రీసైక్లింగ్ చేస్తూ ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని సమాచారం. లబ్ధిదారుల వద్ద నుంచి కిలో రూ 8 నుంచి రూ 10 రూపాయలు వరకూ కొనుగోలు చేస్తున్నారు. రేషన్ మాఫియా ముఠా మిల్లర్లకు రూ15 నుంచి రూ20ల చొప్పున విక్రయిస్తున్నారని తెలుస్తోంది. డీలర్ల కు గిట్టుబాటు ధర లేదని ఇవ్వకపోతే దాడులు చేయిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**అధికారులు ఎందుకు ఉన్నట్లు?:**

పట్టపగలే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నా రెవెన్యూ, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం మమ అనిపిస్తున్నారని మిగితా సమయాల్లో అక్రమార్కుల నుంచి పెద్ద ఎత్తున మామూళ్లు అందుతుండడంతో మెతక ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా చలించడంలేదు. గతంలో 6ఏ కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడు సాహసించకపోవడం గమనారం. అధికారులు మామూళ్ళకు అలవాటు పడటంతో పాత వ్యాపారులతో పాటు కొత్తవారు కూడా మామూళ్ళు అందిస్తూ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారానికి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రుణ మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలి

## - బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 పరిధిలో ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన రుణాల మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, బ్యాంకర్లను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా బ్యాక్వర్డ్ క్లాసెస్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 కింద ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం అమలుపై ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 కింద ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకంలో భాగంగా పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించేలా జిల్లాకు 1,195 యూనిట్లు, అలాగే ఆర్ధికంగా వెనుకబడిన కులాలకు (ఈడబ్ల్యూఎస్) సంబంధించి ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద జిల్లాకు 483 యూనిట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేయడం జరుగుతోందని, యూనిట్ కాస్ట్ 8 లక్షల రూపాయలు ఉండగా, సబ్సిడీ 4 లక్షల రూపాయలు, బ్యాంకు రుణం 4 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించి బిసి యాక్షన్ ప్లాన్ కింద 24 జనరిక్ మెడికల్ షాప్ లు, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సంబంధించి ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద 85 జనరిక్ మెడికల్ షాప్ లు మంజూరు కావడం జరిగిందని, అర్హత కలిగిన బిసి, ఈబీసీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనరిక్ మెడికల్ షాప్ ల ఏర్పాటుపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 13 బ్యాంకుల పరిధిలో యూనిట్ ల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు వారీగా, బ్రాంచ్ వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. చిత్తశుద్ధితో పనిచేసి ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు కృషి చేసి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్లైన్లో సైట్ ఓపెన్ కావడం జరుగుతుందని, మీసేవ, సచివాలయంలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర రావు, ఎల్.డి.ఎం రమేష్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.





# యథేచ్ఛగా ప్రధాన రోడ్డు ఆక్రమణ

**రోడ్డు ఆక్రమణతో ట్రాఫిక్ అంతరాయం**
**ఇబ్బందులు పడుతున్నా ప్రజలు**
**పట్టించుకోని అధికారులు..**
**రోడ్డు ఇరువైపులా ఆక్రమణలే..!**
**వైయస్సార్ సెంటర్ నుంచి రామానాయుడు చెరువు అలుగు వరకు ఆక్రమణలు...**
**చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**





**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 7**

పుల్లల చెరువు మండల కేంద్రములో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఏ వైపు చూసినా రోడ్డునకు ఇరువైపులా ఆక్రమణలే. స్థానిక వైయస్ఆర్ సెంటర్ నుంచి రామానాయుడు చెరువు అలుగు వరకు సుమారు ఒక కిలోమీటరు మేర రోడ్డునకు ఇరువైపులా వ్యాపారస్తులతో పాటు గృహాలు ఉన్న వారు యథేచ్ఛగా రోడ్డుని ఆక్రమించు కున్నారు. ఇంకొంత మంది వ్యాపారస్తులైతే ఏకంగా తమ షాపుల ముందున్న మెయిన్ రోడ్డు స్థలాలను సైతం తోపుడు బళ్లు వారికి అద్దెలకు ఇస్తున్నారు. ఒక పక్క ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి, మరోపక్క కాలువలను ఆక్రమించు కోవడంతో వాటిగుండా పోవాల్సిన నీరు వెల్లక ఎక్కడికక్కడ మురుగు పేరుకు పోవడంతో ప్రజలు రోగాలు బారిన పడడం పట్టణంలో సహజంగా మారిపోయింది. ఇంత జరుగుతున్నా అటు ఆర్ అండ్ బి అధికారులు గానీ ఇటు పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో ఇరుగ్గా తయారై ట్రాఫిక్కి అంతరాయం ఏర్పడుతుండి. వైయస్ఆర్ సెంటర్ నుంచి రామానాయుడు చెరువు అలుగు వరకు సుమారు ఒక కిలోమీటరు మెయిన్ రోడ్డు సుమారు 30 అడుగుల వెడల్పు ఉండాల్సి ఉన్నప్పటికి రెండు వైపులా ఆక్రమించుకోవడం వల్ల కేవలం 30 నుంచి 20 అడుగులకు తగ్గిపోయింది. దీంతో రోడ్డు లో ట్రాఫిక్ ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా ప్రధాన కాలువలు నిర్మాణం జరగనప్పటికీ గృహా యజమానులు కాలువలు రోడ్డు మార్జిన్ పై ఇటుకలతో కాలువలు నిర్మాణం చేపడుతున్నారు.పట్ట పగలే రోడ్డును ఆక్రమించుకొని పలువురు వ్యాపారస్తులు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.రోడ్డు మార్జిన్ పైన కాలువలు కట్టి కాలువల పైన రాళ్ళువేయడంతో పాటు రహదారిని కూడా ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగి స్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపార సౌలభ్యం కోసం రోడ్డును ఆక్రమించుకొని షాపులలో ఉంచవలసిన సామాగ్రిని రోడ్డుపైనే ఉంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.అయినప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి,పంచాయితీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై కాలువలు నిర్మించి రోడ్డుని ఆక్రమించడంతో షాపులకు వచ్చే కొనుగోలుదారులు సైతం తన వాహనాలను రోడ్డుపైనే ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.రోడ్డు పక్కన ప్రధాన కాలువలు కనిపించకుండా కాలువలను రాళ్ళతో కప్పేసి దుకాణాలను నిర్వహించి రోడ్డును ఆమ్రించు కోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కాలువలపై ఇష్టానుసారంగా పలకలు ఏర్పాటు చేసేయడం వల్ల బయటకు పోవలసిన మురికి నీరు సక్రమ మార్గం లో వెళ్లక పోవడంతో కాలువలలో ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఒక్కో చోట కాలువలు మురుగుతో నిండిపోయి రోడ్లపైకి వచ్చేడంతో అంటూ రోగాలతో పాటు వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారిలోని కాలువల్లో పేరుకుపోయిన మురుగు వర్షాల కారణంగా రోడ్డుపైకి వచ్చేయడంతో అందులో దోమలు వృద్ధి చెంది జ్వరాలు విజృంభనకు కారమైయ్యాయని పలువురు చెబుతున్నారు. కాలువలపై పలకలు ఏర్పాటు చేయడంతో కాలువల్లో ఉన్న మురుగును తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆక్రమణకు గురైన రహదారితో పాటు పేరుకుపోతున్న మురుగు కూపాలు తొలగించడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి!!

**దాడులు పరిష్కారం కాదు !!**

**బిజెపి నేత ఉదయ శంకర్**



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 7**

సమస్యలు ఎదురైతే సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలి తప్ప దాడులు చేసుకోవడం సరైన విధానం కాదని బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యాలయం పై కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దాడులు చేయడం సరైన విధానం కాదని ఈ దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామనితెలిపారు .బిజెపి నాయకులు రమేష్ బిదూరి కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పై చేసిన వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ నేతలు వివరణ తీసుకోవాలి లేదా అవసరమైతే మాటలు వెనక్కు తీసుకోవాలని కోరాలే తప్ప కార్యాలయాలపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలని కోరారు . ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# గంటావానిపల్లె యడవల్లి పొలం పిలుస్తోంది





**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 7**

మండలం లోని యడవల్లి, గంటవనిపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో సాగు చేసిన మిరప, మొక్కజొన్న, బత్తాయి, మినుము పంటలను సందర్శించి, రైతులకు ఎన్ పి ఎస్ ఎస్ అప్ గురించి అవగాహనా కల్పించడం జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న ఈ పంట నమోదు, ప్రధాన మంత్రి పసల్ భీమా పథకం, ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏఈఓ చైతన్య కుమార్, వి హెచ్ ఎ సంధ్య బాయి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జున రెడ్డి గారు, రైతులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు సేవా గుణం అలవరచుకోవాలి

**– ఒంగోలు ఎం ఈ ఓ కిషోర్ బాబు పిలుపు**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

విద్యార్థులు చదువులతో పాటు సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందు ఉండాలని ఒంగోలు ఎం ఈ ఓ కిషోర్ బాబు పిలుపునిచ్చారు. డిసెంబర్ 24వ తేదీన ఎస్ఎఫ్ఐ – యుటిఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీలు నిర్వహించిన 10వ తరగతి ప్రజ్ఞ వికాస పరీక్ష విజేతలకు మంగళవారం ఒంగోలులోని ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ఒంగోలు ఎస్ ఎఫ్ ఐ పట్టణ కార్యదర్శి వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఎం ఈ ఓ కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్ ఎఫ్ ఐ నాయకులను అభినందించారు. చదువులు పరీక్షల కోసం మాత్రమే కాదు జ్ఞానం పెంచుకునేందుకు ఉపయోగపడాలని తెలిపారు. జరగబోవు 10 పరీక్షల్లో బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డైఫి రాష్ట్ర కార్యదర్శి రామన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.




# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

## - మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కల్పన

## - నగరంలోని అద్దంకి బస్టాండ్ లో మెప్మా బజార్ ఏర్పాటు







**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారవుతున్న ఉత్పత్తుల అమ్మకాలను ఎగ్జిబిషన్ ను ఈనెల 7, 8 తేదీలలో రెండు రోజులపాటు జరుగుతుందని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కల్పన అన్నారు. నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో మెప్మా ఆధ్వర్యంలో మెప్మా బజార్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాలు, మెప్మా పీడీ ఆధ్వర్యంలో ప్రతి నెలలో రెండు రోజులు పాటు మెప్మా బజార్ను నిర్వహించి వారు తయారు చేస్తున్న ఉత్పత్తుల అమ్మకాలు జరుగుతాయని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మెప్మా ఉత్పత్తులు అమ్మకం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన పెరుగుతుందని అన్నారు. ఈ మెప్మా బజార్ను నగర ప్రజలు సందర్శించి నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారని ప్రజలందరూ కూడా నాణ్యమైన, తక్కువ ధరకు అందించే ఈ మహిళా ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏవో వినీల్, టీ ఈ మార్కెటింగ్ డి సంతోష్ కుమార్, సి ఓ లు మరియమ్మ,రత్నకుమారి, రూప,మాధవి, మై మున్నీసా సునీత, శేషారత్నం, సుజారాణి, ఆర్పీలు,డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## 90శాతం సబ్సిడీ పై డ్రిప్, 50 శాతంనికి సబ్సిడీ పై

# స్ప్రింక్లర్స్ అందిస్తున్నాం !!

**రైతులు సద్వినియోగం చేసుకోండి -అతి వృష్టి , అనావృష్టిలో**

**సమయంలో నష్ట పరిహారం పొందాలంటే ఈ -పంట నమోదు తప్పనిసరి**







**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 7**

గిద్దలూరు మండలంలో దంతెరపల్లి, ఓబులాపురం తాండ గ్రామంలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2024-25 కి సంబంధించి ఈ-పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని. రైతులు అందరూ తప్పనిసరిగా రబీ సీజన్లో వేసిన ప్రతి ఒక్క పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదు చేసుకోవడం వలన అతివృష్టి ,అనావృష్టి వచ్చినప్పుడు సంభవించినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, పంటల భీమా, మద్దతు ధర , సున్నా వడ్డీ తదితర ప్రభుత్వ సహాయలు అందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకొని ఉండాలని తెలిపారు. సూక్ష్మ నీటి యాజమాన్యం శాఖ అధికారి మోహన్ కృష్ణ మాట్లాడుతూ 90శాతం సబ్సిడీ పై డ్రిప్, 50 శాతం సబ్సిడీ పై స్ప్రింక్లర్స్ అందిస్తున్నామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభ అనంతరం జొన్న , కంది మొదలైన పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు , వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రవి , రైతులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

## - ప్రయాణికులకు సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సులు

## - రీజినల్ మేనేజర్ బి. సుధాకర్

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్. జనవరి 07**



సంక్రాంతి పండుగ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ప్రకాశం రీజియన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. సుధాకర్ అన్నారు. మంగళవారం ఒంగోలు నగరంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గల ఆయన చాంబర్లో పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా ప్రైవేటు వాహనాలకు ధీటుగా ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాదు నుండి ప్రకాశం రీజన్ పరిధిలో వచ్చే ప్రయాణికులకు ఏసీ బస్సులతో పాటుగా సూపర్ లగ్జరీ, స్లీపర్ కోచ్ అందుబాటులో ఉంచామన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఉద్యోగులకు రెండవ శనివారం ఆదివారం తో పాటుగా ఐదు రోజులు సెలవులు కలిసి వచ్చాయని అందుకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రయాణికులు ముందుగానే ఆన్లైన్ ద్వారా రిజర్వేషన్లు పొందాలన్నారు. ఆర్టీసీ బస్సులు కొత్తవి 110, హయ్యర్ బస్సులు కొత్తవి 29 అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజలకు ఆర్టీసీ పట్ల ఆదరణ కలిగే విధంగా అన్ని ఏర్పాట్లు అన్ని హంగులతో బస్సులను సిద్ధంగా ఉంచుతున్నామని, హైదరాబాదు నుండి వచ్చే ప్రయాణికుల సౌకర్యం కొరకు ఆర్టీసీ సిబ్బందిని కూడా ఈనెల 10వ తేదీ నుండి హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో అందుబాటులో ఉండి ప్రజలకు సూచనలు సలహాలు ఇచ్చి సురక్షిత ప్రయాణం చేసే విధంగా చర్యలు తీసుకుంటారని వారు తెలిపారు. సెలవులు, పర్వదినాలలో అధిక చార్జీలను వసూలు చేసే అవకాశం లేదని సాధారణ చార్జీలతో ఆర్టీసీలో ప్రయాణం చేయవచ్చని అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో కూడా ఒంగోలు ఆర్టీసీ డిపో, ప్రకాశం డివిజన్లోని అన్ని డిపోలలో రిజర్వేషన్ల ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారని తిరుగు ప్రయాణం చేసేవారు ముందుగానే రిజర్వేషన్లను చేసుకోవాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణం సుఖమయమని, బస్సు ఏ ప్రాంతం నుండి బయలుదేరుతుంది ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఏపీ లైవ్ ట్రాక్ ని కూడా ఏర్పాటు చేశామని ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ సౌకర్యాన్ని కూడా ఉపయోగించుకోవాలని కోరారు.

# ఇట్టా వెంకట్రావు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేసిన మంత్రి డా.డోలా



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఇట్టా వెంకట్రావు కుటుంబానికి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం నాడు తూర్పు నాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో రూ.5 లక్షల పరిహారం అందజేశారు. కొండపి నియోజకవర్గం చిర్రికూరపాడుకు చెందిన ఇట్టా వెంకట్రావు గతేడాది అక్టోబర్ 1 న విద్యుత్ షాక్ కి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి డోలా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి రూ. 5 లక్షల పరిహారం మంజూరు జేసింది. ఈ చెక్కును నేడు మంత్రి డోలా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు గొట్టిపాటి, డోలాకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లెజెండ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరించిన పువ్వాడి వెంకటేశ్వర్లు, పందిటి హరీష్, డివి మనోహర్, కొండిశెట్టి రమణయ్య

**పెన్ పవర్ పామూరు జనవరి 07**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18వ తేదీ ఎన్టీఆర్ గవర్నమెంట్ వారు నిర్వహించే లెజెండ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ పోస్టర్ ను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపులో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, పందిటి హరీష్ ,బిజెపి కనిగిరి నియోజకవర్గం కన్వీనర్ కొండిశెట్టి రమణయ్య, పామూరు మండల జనసేన అధ్యక్షుడు దర్శి ఏడుకొండలు , బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, మోబిన మౌలాలి, అడుసు మల్లీ ప్రభాకర్ చౌదరి, జనసేన సందాని ,హరి, మండల రమణయ్య, శేషం మోసే మాదిగ తెలుగుదేశం పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







# శీఘ్ర దర్శనం టోకెన్లతో సులభంగా శ్రీగిరి శ్రీవారి దర్శనం

- ముక్కోటి కి శ్రీగిరిలో విస్తృత ఏర్పాట్లు -బుధ వారం నుండి శీఘ్ర దర్శనం టోకెన్లు జారీ

- శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

ఈ నెల 10వ తేదీ శుక్రవారం ముక్కోటి పర్వదినం నాడు భక్తులు త్వరిత గతిన తమ కుటుంబ సభ్యులతో శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా గంటకు వంద శీఘ్ర దర్శనం టోకెన్లను జారీ చేయనున్నట్లు కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి.. కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామ కృష్ణారావు.. ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు.. ఆలూరు లక్ష్మీ కుమారి వెల్లడించారు. మంగళవారం శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ముక్కోటి పర్వదినం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శీఘ్ర దర్శనం టోకెన్లతో సమయం వృధా కాకుండా భక్తులు తమ కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకునేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. బుధవారం నుండి శీఘ్ర దర్శనం టోకెన్ల జారీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శీఘ్ర దర్శనం టోకెన్లు కావలసిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని ఒక ఆధార్ కార్డు పై సంబంధిత కుటుంబ సభ్యులందరినీ వారు కోరుకున్న సమయంలో శీఘ్ర దర్శనానికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముక్కోటి పర్వదినం నాడు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతోపాటు భక్తులకు శ్రీవారి దర్శనం శీఘ్ర గతిన జరిగేలా శీఘ్ర దర్శనం టోకెన్లు జారీ పద్ధతి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శ్రీగిరి లో నూతనంగా ప్రవేశపెట్టిన శీఘ్ర దర్శనం కార్యక్రమం విజయవంతమయ్యేలా భక్తులు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులకు తమ వంతు సహకారం అంద చేయాలని కోరారు.

**13 నుండి ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు:**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల13 నుండి 15 వరకు ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. 13వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ధనుర్మాస వైభవం అనే అంశం పై ఉపన్యసిస్తారు.

14 వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఊంజల సేవ.. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ చే భక్తి సంగీత విభావరి,.15 వ తేదీ సాయంత్రం శ్రీవారి తిరు వీధి ఉత్సవం.. స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతాయి.

**25 న విగ్రహ ప్రతిష్టాపన:**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాత,.వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వెంకట రమణా రావు కాంస్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఈ నెల 25 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ గిరిలో నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీగిరి గో క్షేత్రంలో జరిగే అభినందన సభలో విశ్రాంత హై కోర్టు జడ్జి డాక్టర్ కె.జి. శంకర్..విశ్రాంత పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ జి సూర్య ప్రకాశ రావు..ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్..హై కోర్టు అడ్వకేట్ వి ఉమాదేవి తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దివంగత ఆలూరు సీతారామమ్మ పేరిట వకుళారాధన కార్యక్రమం జరుగుతుంది. వకుళారాధనలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులు..వెంకటగిరి మాజీ శాసన సభ్యులు డాక్టర్ వి బి సాయికృష్ణ యాచేంద్ర చే సంగీత గేయ ధార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు కోరారు.

## ఎస్సీ కులగణనపై 12వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. జనవరి,07వ తేదీతో గడువు ముగియనుండటంతో మరొక 5 రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఓపీ విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నెంబరు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

## మార్కాపురం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంను ముట్టడించిన శానిటేషన్, సచివాలయ ఉద్యోగులు



**మార్కాపురం పెన్ పవర్ జనవరి 7**

మార్కాపురం మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ మరియు ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ పై అనుచితంగా దుర్భాషలాడి కొట్టడానికి పోయిన మున్సిపల్ కమిషనర్ డివి నారాయణరావుఇప్పటికే కమిషనర్ ప్రవర్తనతో విసుగు చెంది సెలవు పై వెళ్లిన కొంత మంది సెక్రటరీలుకమీషనర్ నారాయణరావు ఏకపక్ష నిర్ణయాలతో అసహనంతో ఎన్జీవో లకుఫిర్యాదుచేసిన పట్టించుకో క పోవడంతో సచివాలయ ఉద్యోగులుమున్సిపాలిటీ లోని కమిషనర్ కార్యాలయం వద్ద క్రింద కూర్చుని నిరసన తెలుపుతున్నసచివాలయఉద్యోగులు ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమిషనర్ తో చర్చలు నిర్వహించిన ఎన్జీవో నాయకులు మున్సిపల్ కమిషనర్ నారాయణరావుతో మాట్లాడి సానిటరీ మరియు ఎన్విరాన్మెంట్ సెక్రటరీ కు క్షమాపణ చెప్పడంతో సచివాలయం ఉద్యోగస్తులు నిరసన విరమించి విధులకు హాజరయ్యారు.

## రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మండల వ్యవసాయాధికారి జైను లాబ్దిన్



**పొదిలి, పెన్ పవర్ జనవరి 7**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ జైను లాబ్దిన్ కోరారు మంగళవారం నాడు మండలంలోని ఈగల పాడు, పాములపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు అలాగే ఆయా గ్రామాల్లోని రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి జైను లాబ్దిన్ పంటల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు వ్యవసాయపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, వెంటనే వాటిని తమ దృష్టికి తీసుకుని వచ్చి, పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జైను లాబ్దిన్ తోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సింగర పల్లె గ్రామవాసి

**బేస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 7**

బెస్తవారిపేట మండలంలోని సింగరపల్లి గ్రామానికి చెందిన కామునూరి విజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్రంలో ఒకే నెలలో రెండు ఉద్యోగాలు బెస్తవారిపేట మండలం సింగర్ పల్లి గ్రామానికి చెందిన కామనూరి చంద్రమోహన్ జ్యోతి ల కుమారుడు చంద్రమోహన్ ఘనత సాధించారు. తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన పోలీస్ ఉద్యోగ నియామకల్లో కాము నూరి విజయ్ కుమార్ పోలీస్ ఉద్యోగం సాధించారు. అనంతరం నిర్వహించిన గ్రూప్ 4 లో 12 వ ర్యాంకు సాధించి జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నెల రోజుల వ్యవధిలోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు చంద్రమోహన్ జ్యోతులతో పాటు, గ్రామ ప్రజలు మరియుమండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మెగా డిఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి - డివైఎఫ్ఐ డిమాండ్




**రిపోర్టర్ ఒంగోలు సిటీ, పెన్ పవర్ జనవరి 07**

రాష్ట్రంలో గత ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలు పట్టణంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడూ భర్తీ చేస్తారో కూటమి ప్రభుత్వం స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. మోగా డిఎస్సీ పై కాలయాపన తగదని వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మోగా డిఎస్సీలో ప్రకాశం జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు 4 శాతం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ 6 పథకాలలో ఒకటి నిరుద్యోగ భృతి అని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ విచ్చలవిడిగా విలయ తాండవం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డ్రగ్స్ నివారణ పై ఎటువంటి నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయలేదు, ప్రత్యేకంగా డ్రగ్స్ నివారణ కమిటీలు ఏర్పాటు చేసి పకడ్బందీగా నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డైఫీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కె. వి. పిచ్చయ్య, కె. ఎఫ్. బాబు మాట్లాడుతూ జిల్లాలో ఒక్క రెవిన్యూ డిపార్ట్ మెంట్ లోనే క్షేత్ర స్థాయిలో మొదలుకొని అన్ని క్యాడర్ ఉద్యోగులు 9 రకాలు వున్నారు.వీరు అంతా జిల్లాలో 649 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరిలో తాశిల్దార్ పోస్టులు. విఆర్ఏ పోస్టులు , గ్రెడ్ 1 విఆర్ఏ లు ,సీనియర్ అసిస్టెంట్ డిప్యూటీ తసిల్దారులు ఇతర పోస్టులు,మొత్తం 649 ఖాళీగా ఉన్నాయి,వీటిని భర్తీ చేయాలి,ఇవే కాకుండా అనేక రకాల డిపార్ట్ మెంట్ లలో ఉన్న రకరకాల కాళి పోస్టులను భర్తీ చేయాలి, గతంలో ఈ జిల్లా కు ప్రకటించిన కనిగిరి నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్,దర్శి డ్రైవింగ్ స్కూల్, చీమకుర్తి శిల్పారామం , ప్రకాశం జిల్లా కు ప్రకటించిన యూనివర్శిటీ కి నిధులు కేటాయించి యూనివర్శిటీ ని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమవేశం లో డైఫీ జిల్లా ఉపాధ్యక్షులు పి .కిరణ్, పి.నరేంద్ర జి.కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చుండి, అయ్యవారి పల్లిలో పొలం పిలుస్తుంది



**వలేటివారిపాలెం పెన్ పవర్ జనవరి 7**

మండలంలోని చుండి మరియు అయ్యవారిపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఎం హేమంత్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మినుము కోతలు అయిన తరువాత అనంతరం నువ్వుల పంట సాగు చేసుకుంటే లాభదాయంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం నువ్వులు మార్కెట్లో 13 నుండి 14 వేల వరకు మంచి గిట్టుబాటు ధర ఉందని చెప్పారు. కాబట్టి మినుము అనంతరం నువ్వు పంట సాగు చేసుకోవలసినదిగా సూచించటమైనది కావలసిన విత్తనాలు నువ్వుల రకాలు వైఎల్ఎం 146 మరియు వైఎల్ఎం 66 రకాలు చిన్న పావని రీసెర్చ్ స్టేషన్ నందు అందుబాటులో ఉన్నాయి. కావలసిన రైతులు మీ గ్రామ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలియజేశారు . ఈ రబీలో సాగు చేసిన పంటలన్నీ ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే సున్నా వడ్డీ పంట రుణాలు, అలాగే పంటల భీమా చెల్లించి ఉన్న రైతులకు పంటల బీమా పొందాలి అంటే ఈ పంట నమోదు తప్పనిసరి మీ గ్రామ పరిధిలోని వ్యవసాయ ఉద్యానవన సహాయకులను సంప్రదించి ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు . అనంతరం చుండి గ్రామంలోని చెరువుపల్లి ప్రభాకర్ మినుము పొలంలో వ్యవసాయ సహాయకులు పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతులతో కలిసి 5 జ 5 మీటర్లు మార్కింగ్ చేసుకొని దానిలో వచ్చిన దిగుబడిని ఇన్సూరెన్స్ కంపెనీ వారికి తెలియజేయడం జరుగుతుందని దాని ద్వారా భీమా చెల్లించిన రైతులకు పంటల భీమా పొందే అవకాశం ఉంటుందని పంటకోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబలను బట్టి ఇన్సూరెన్స్ క్యాలిక్యులేషన్ జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ ఉద్యానవన సహాయకులు పి.నాగరాజు, సిహెచ్ రవీంద్ర అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ దేగ వెంకటేశ్వర్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బంతి కంది వరిగ పంటలను పరిశీలించిన ఏవో దేవి రెడ్డి శ్రీనివాసులు



**మార్కాపురం పెన్ పవర్ జనవరి 7**

మార్కాపురం మండలంలోని ఇడిపూరు బోడపాడు గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయి పర్యటన చేసిన హెచ్.ఓ రమేష్ మరియుఏవోశ్రీనివాసులు బంతి పంటను పరిశీలించి, బంతి పంటలో చేపట్టవలసిన మేలుకువల గురించి రైతులకు వివరించారు.అలానే ఏ.ఓ వరిగ పంటను పరిశీలించారు.తదుపరి ఇడుపూర్, బోడపాడు గ్రామాల యందు గ్రామసభలు నిర్వహించి. ఈ గ్రామసభలో భాగంగా ఏ.ఓ దేవిరెడ్డిశ్రీనివాసులుమాట్లాడుతూ ప్రస్తుతం ఆరోగ్య రీత్యా చిరుధాన్యాల ప్రాముఖ్యత ఎక్కువగా ఉందని కావున రైతులు చిరు ధాన్యాలు అయిన కొర్రలు, వరిగలు, సజ్జలు, సామలు, ఆరికల వంటి పంటలు సాగు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇడుపూరు బోడపాడు రైతు సేవ కేంద్రం సిబ్బంది సాయిరాం పావనేశ్వరి మరియు ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సర్వేలు సమర్థవంతంగా నిర్వహించండి

బ్రాహ్మణపల్లి లోని గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో మస్తాన్ వలి.

సమయపాలన పాటించాలని కోరుతూ ఇచ్చిన సూచనలు సలహాలు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో విధులు నిర్వహించాలి.





**కొమరోలు పెన్ పవర్ జనవరి 7**

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి గ్రామ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు .మంగళవారం ఆయన బ్రాహ్మణపల్లి లోని గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు .ఆ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు .ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ గ్రామ సచివాలయానికి అవసరాల కోసం వస్తున్న ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ,వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన హౌస్ హోల్డ్ సర్వే ,మిస్సింగ్ సీనియర్ సిటిజన్ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన కోరారు .ఆ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామ శివాలయం కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు –సీఐ సురేష్





**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 7**

గిద్దలూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్, చిన్న మసీదు వీధి వద్ద ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులను దుఖాణ యజమానులను గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ మంగళవారం మందలించారు. రోడ్డుకు ఇష్టానుసారంగా అడ్డంగా పెట్టిన వాహనాలను తొలగింప చేశారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ అత్యధికంగా ఉన్న నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ సురేష్ ప్రజలను వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించరాదని స్థానిక దుఖాణదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

# ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా, వారి వివరాలపై సోషల్ ఆడిట్ ను ఈ నెల 12 వరకు ప్రభుత్వం పొడిగించింది. అభ్యంతరాలు ఏమైనా ఉంటే 12వ తేదీ లోపు గ్రామ, వార్డు సచివాలయాలకు తెలియ చేయాలి. తర్వాత 16 వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం 20 న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు.

## వెలుగు కార్యాలయంలో లైవ్ వుడ్ స్టాక్

# నిధులు గోల్ మాల్.!!

### 35 లక్షలు నిధులు ఏమయ్యాయి..??– మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆరోపణ








**బేస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 7**

బేస్తవారిపేట వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారుల అలసత్వం కారణంగా గత 12 సంవత్సరాల నుండి 35 లక్షలు రూపాయల లైవ్ వుడ్ స్టాకు నిధులు ఏమయ్యాయని బేస్తవారిపేట ఎంపీపీ వేగినాటి ఓ సురారెడ్డి వెలుగు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బేస్తవారిపేట మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు వేగినాటి ఓసూరా రెడ్డి అధ్యక్షతన మండల అభివృద్ధి అధికారి రంగనాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఓ సూరారెడ్డి మాట్లాడుతూ బెస్తవారిపేట మండలంలో 19 గ్రామ పంచాయతీలలో ఐదుగురు వివోఏ లను గ్రామ లోని గ్రూప్ సభ్యుల అనుమతి లేకుండా ఎలా మార్చారు అంటూ వెలుగు సిసి ప్రశ్నించారు. బెస్తవారిపేట మండలంలో ఐదుగురు వెలుగు వివో ఏ లను అక్రమంగా తొలగించా తొలగించారని నిబంధనల ప్రకారం వారిని తొలగించకపోవడంతో తాము కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. గతంలో గ్రూప్ సభ్యులకు లైవ్ వుడ్ స్టాకు కింద మండలంలోని చిన్న ఓబినేనిపల్లి గ్రామంలో సరస్వతి గ్రూపునకు లక్ష 70 వేల రూపాయలు మంజూరు చేసినట్లు ఆన్లైన్లో ఎలా నమోదు చేశారని ప్రశ్నించారు. గతంలో వెలుగు కార్యాలయంలో 35 లక్షల రూపాయలు నిధులు ఉన్నాయని ఆ నిధులు గ్రూప్ సభ్యులు ద్వారా రికవరీ చేశారా లేదా అని ప్రశ్నించారు. వెలుగుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రంగనాయకులు సూచించారు. పశువైద్య శాఖ సమీక్ష సమయంలో మండలంలో నాలుగు పశు వైద్యాధికారులు లున్నప్పటికీ ఒకరు మాత్రమే మండల సమావేశానికి హాజరవటంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు సమావేశాల నుండి పశువైద్య శాఖ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. రెవిన్యూ శాఖ సమీక్షలో రెవిన్యూ అధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ ఉండడంతో పేదలకు అందవలసిన కందిపప్పు బియ్యం పక్కదారి పడుతున్నాయన్నారు. స్థానిక తాసిల్దార్ ఆహార సలహా కమిటీ ని ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఆర్ బ్ల్యూఎస్ సమీక్ష సమావేశంలో గలిజెరుగుల ఎంపిటిసి సభ్యులు సురేష్ మాట్లాడుతూ గలిజేరుగుల్ల ఎస్సీ కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేయకుండా పంచాయతీరాజ్ అధికారులు రద్దు చేశారని ఆరోపించారు. తాను పైపులైను వేయమని అధికారులను వేడుకంటే అదిగో ఇదిగో అని షాకు లు చెబుతున్నారని పైపులైన్ వేసి కాలనీవాసుల దాహార్తి తీర్చాలని సమావేశంలో కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అందుకు స్పందించిన పంచాయతీరాజ్ ఏఈ తావు నాయక్ గలిజేరు గుల్ల ఎస్సీ కాలనీలో పైప్ లైన్ ఏర్పాటుచేసి కుళాయిలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, మండలంలోని పంచాయతీ సెక్రెటరీలు, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## పొలం వద్ద కాపలాగా ఉంటున్న

# రైతుపై యాక్సిస్ బ్లేడుతో దాడి

*కొమరోలు మండలం బసువు పల్లి పొలాల్లో సంఘటన.*

*పొలాలకు దారి విషయంలో ఇరువు వర్గాల మధ్య ఘర్షణ.*

*గాయపడిన వెంకట్రామిరెడ్డిని 108 వాహనంలో గిద్దలూరు ఆసుపత్రికి తరలింపు.*

*కేసు దర్యాప్తు చేస్తున్న కొమరోలు పోలీసులు.*




**కొమరోలు పెన్ పవర్ జనవరి 7**

ఇరుగుపొరుగు పొలాల రైతులు దారి విషయంలో పడిన ఘర్షణలో ముడిమాల వెంకట రామిరెడ్డి అనే రైతుపై మరో రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి యాక్సిస్ బ్లేడు తో దాడి చేసి గాయపరిచిన సంఘటన కొమరోలు మండలం ముక్తాపురం పంచాయతీలోని బస్సు పల్లె గ్రామ పొలాల్లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది.కొమరోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ..బసువు పల్లి గ్రామానికి చెందిన కాకునూరి హేమలత, ముడిమాల వెంకట్రామిరెడ్డి లకు ఇరువుపరుగు పొలాలు ఉన్నాయి. అయితే హేమలత పంట పొలంలో నుంచి వెంకట్రామిరెడ్డి అతని కూలీలు సోమవారం వెళ్లారని, దీనితో పంట దెబ్బతినడంతో హేమలత సోమవారం సాయంత్రం వెంకట్రామిరెడ్డిని ఇంటి వద్ద ప్రశ్నించిందని పోలీసులు తెలిపారు. ఆ సందర్భంగా హేమలత, వెంకట్రామిరెడ్డి మధ్య ఘర్షణ జరుగగా వెంకట్రామిరెడ్డి అతని భార్య, బావమరిది కలసి హేమలతను తల వెంట్రుకలు పట్టుకుని లాగి కొట్టారని ఆ మేరకు హేమలత సోమవారం సాయంత్రం హేమలత కొమరోలు పోలీస్ స్టేషన్కు వచ్చి తమకు ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. అదే సమయంలో వెంకటరామిరెడ్డి కూడా తనపై హేమలత ఆమె కుటుంబ సభ్యులు దాడి చేసి దుర్భాషలాడారని పేర్కొంటూ ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు .దీనితో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసును నమోదు చేశామన్నారు .అయితే తాను సోమవారం రాత్రి తన భార్యతో కలిసి తన మొక్కజొన్న పొలానికి కాపలాగా వెళ్లానని, తన భార్య గుడిసెలో నిద్రిస్తుండగా తాను పొలం చుట్టూ తిరుగుతూ కాపుల కాస్తూ ఉన్నానని ,ఆ సమయంలో హేమలత బంధువు గుర్రాల వెంకటరమణారెడ్డి తనపై యాక్సిస్ బ్లేడుతో దాడి చేశాడని, ఆ సందర్భంగా తనకు కాలి తొడపై, ఎడమ చేతి పై, పొట్ట ఎడమ భాగంపై గాయాలయ్యాయని ,తాను 108 వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి తనను గిద్దలూరు ఆస్పత్రిలో చేర్పించారని వివరిస్తూ ముడిమాల వెంకటరామిరెడ్డి గిద్దలూరు పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చాడు. వెంకట్రామిరెడ్డి స్టేట్మెంట్ను రికార్డు చేసిన గిద్దలూరు పోలీసులు కొమరోలు పోలీసులకు ఎండార్స్ చేశారు .ఆ మేరకు కేసు నమోదు చేసి రేపు చేస్తున్నామని కొమరోలు పోలీసులు తెలిపారు.

## పిఎఫ్ లోన్లు క్లోజర్స్ వెంటనే

# మంజూరు చేయాలి – బిటిఏ విజ్ఞప్తి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ప్రతి జిల్లాలో జిల్లా పరిషత్ కార్యాలయంలో అపరిష్కృతంగా ఉన్నటువంటి ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, క్లోజర్లు వెంటనే క్లియర్ చేసి మంజూరు చేయాలని జిల్లా డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి బాలమ్మ కు ప్రకాశం జిల్లా శాఖ తరపున వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న పిఎఫ్ బకాయిలు, పిఎఫ్ ఖాతా సమస్యలు సత్వర పరిష్కారం చేయాలని కోరారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కర్ర దేవ సహాయం మాట్లాడుతూ టీచర్లు తమ పి.యఫ్ ఖాతాలలో దాచుకున్న డబ్బును తమ అత్యవసరాలకు అనగా పిల్లలు పెళ్ళిళ్లు, గృహ నిర్మాణాలు,హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం తిరిగి తీసుకుందామని దరఖాస్తు చేసుకుని యున్నారు. గత సంవత్సరం ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు పిఎఫ్ క్లోజర్స్ లోన్లు క్రెడిట్ కాకపోవడం, షెడ్యూల్స్ ని ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయకపోవడం మొదలైన సమస్యల వలన రిటైర్మెంట్ అయిన ఉపాధ్యాయులు, లోన్లు పెట్టుకున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు మాట్లాడుతూ రిటైర్మెంట్ అయిన ఉపాధ్యాయులు వారికి రావాలసిన బకాయిలు వస్తాయని ఆశతో అప్పులు చేసి వడ్డీలు కట్టుకుంటూ జీవిస్తున్నారని ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పారాబత్తిన జాలరామయ్య, ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, చెక్క కోటేశ్వరరావు, నన్నుసాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడివరంలో సిమెంట్ రోడ్ నిర్మాణం



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 7**

పుల్లల చెరువు మండలం ఉమ్మడి వరం గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు మొనగాల రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సీ సీ రోడ్లను ప్రారంభించారు. ఉమ్మడివారం పంచాయితీలోని ఆంజనేయ స్వామి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో 170 మీటర్ల దూరం వరకు ఈ సిమెంట్ రోడ్డును నిర్మించడం జరుగుతుందని మునగాల రామిడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా ఈ వీధిలో ప్రజలు రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బందులు పడే వారిని వాటిని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు ఆధ్వర్యంలో ప్రారంభమైన పల్లె పండుగ కార్యక్రమంలో ఈ వీధికి సిమెంట్ రోడ్డు వేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఈ పనులన్నిటిని పూర్తి చేయించి ప్రజలకు మేలు చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుందూరు వెంకటరెడ్డి, కుందూరు కృష్ణారెడ్డి, కుందూరు కోటిరెడ్డి, కుందూరు సిద్ధారెడ్డి, కుందూరు రామురెడ్డి, కుందురు వీరనాగిరెడ్డి, ముటుకూరి శ్రీనివాస్, కుందూరు శేశిరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనుష భాయ్, కే వెంకటయ్య, కే వెంకటేశ్వర్లు, కుందూరు చిన్నాగిరెడ్డి, గంగవర కృష్ణారెడ్డి, రాయుడు,అన్నపురెడ్డి ఎల్లారెడ్డి, బి సురేష్ పాల్గొన్నారు.

## క్విస్ ఫెస్ట్ 2025

# పోస్టర్ ఆవిష్కరణ

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో జరిగే క్విస్ ఫెస్ట్ 2025ను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు క్విస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. సూర్య కల్యాణ్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. శ్రీగాయత్రి తెలిపారు. క్విస్ ఫెస్ట్ 2025 పోస్టర్ ని కళాశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఏటా ఫెస్ట్ ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది నేషనల్ లెవెల్లో జరగుతుందని, వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. రివైవ్, రీ యూజ్, రీ సైకిల్ అనే కాన్సెప్ట్ తో పర్యావరణహితంగా ప్రాజెక్ట్ లు, పేపర్ ప్రజంటేషన్స్, క్విజ్, టెక్నికల్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పాటల పోటీలు, డ్యాన్సులు, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి జ్ఞాపికలు, నగదు బహుమతి, ప్రశంస పత్రాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. వైవి. హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ డి. సమీర్ కుమార్, ఫెస్ట్ కో – ఆర్డినేటర్లు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 7 వ రోజు పారదర్శకంగా కొనసాగిన కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులు 267 మంది అభ్యర్థులు దేహ దారుఢ్య పరీక్షల్లో అరత సాధించారని జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు పోలీసు కానిస్టేబుల్ నియామక పక్రియలో భాగంగా జిల్లాకు సంబంధించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అరత సాధించిన పురుష అభ్యర్థులకు పి.ఎం.టి., పి.ఈ.టి పరీక్షలు మంగళవారం జిల్లా పోలీసు మైదానంలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహణ క్రమంలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన, బయోమెట్రిక్, ఎత్తు %ఇ% ఛాతీ కొలత వంటి ఫిజికల్ మెజర్మెంట్‌లు చేయబడతాయని, దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ వంటి అంశాలను ఆధునిక %ప్రౌ.ఈ% కంప్యూటరైజ్డ్ టెక్నాలజీ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పరికరాలతో పకడ్బందీగా జిల్లా ఎస్పీ గారు పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. మంగళవారం 361 మంది అభ్యర్దులు దేహ దారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 267 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు వారు సూచనల మేరకు కాల్ లెటర్ లో తెలిపిన అన్ని ధ్రువీకరణ పత్రాలతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించిన ఒక సెట్టు జిరాక్స్ కాపీలు తో హాజరుకావాలని జిల్లా ఎస్పీ సూచించారు. అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు ఈనెల 10 న జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో తమ అప్పీల్ అందించవచ్చని అన్నారు. ఎవరైతే కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను ఆధారంగా చేసుకుని టెస్టులకు హాజరవ్వాలని, ఎలాంటి ఒత్తిడి లేకుండా తమ ఆరోగ్య పరిస్థికి అనుగుణంగా పరీక్షలలో పాల్గొనవల్సిందిగా తెలియజేశారు. ఈ ఈవెంట్స్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఎస్బి డిఎస్పీ సురేష్ బాబు, దర్శి డిఎస్పీ లక్ష్మి నారాయణ, పిటిసి డిఎస్పీ మాధవ రెడ్డి, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహన్ రావు, ఐటి కోర్ సీఐ వి. సూర్యనారాయణ, డీటీసీ సీఐ షేక్. షమీముల్లా, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి,షేక్ ఖాసీం, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మూలం చదివే

**సీనియర్ పాత్రికేయులు స్వర్గీయ వన్నెంపల్లి నారాయణ వర్ధంతి సభలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి**



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 7**

సమాజంలో చదువు ద్వారానే చైతన్యం కలుగుతుందని సీనియర్ జర్నలిస్టు స్వర్గీయ వన్నెంపల్లి. నారాయణ తన చదువు ఉద్యోగము మరియు పాత్రికేయ వృత్తి ద్వారా సమాజాన్ని ,కుటుంబాన్ని చైతన్య పరచగలిగారని పెద్ద దోర్నాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వన్నంపల్లి. మహాలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోపెద్ద దోర్నాల మండలం సీనియర్ పాత్రికేయులు రిటైర్డ్ లెక్చరర్ స్వర్గీయ వన్నంపల్లి నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి మాట్లాడుతూ తన నాన్నగారైన ఉపాధ్యాయునిగా లెక్చరర్ గా పనిచేసి పదవి విరమణ అనంతరం ప్రజాశక్తి పాత్రికేయులుగా సుధీర్ఘముగా పనిచేసి సమాజానికి తనవంతు సేవలందించి ఆదర్శంగా నిలిచారని, ఆయన ఆశయసాధనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అయితే పిల్లలను చదివించి వారి బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులే శ్రీకారం చుట్టాలని, చదువుదారినే చైతన్యం కలుగుతుందన్నారు. తమ కుటుంబంలోని అందరూ ఉద్యోగాలు పొంది తమ తమ ఉద్యోగాలతో ప్రజలకు సేవలు అందించడం తండ్రి ఇచ్చిన చదువు ద్వారానే కలిగిందని సంతృప్తిని ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ వార్త పాత్రికేయులు డిపి యేసయ్య, మందలపు చిన్న కాశిరెడ్డి మాట్లాడుతూ గురువు దేవుడు లాంటివాడని, స్వర్గీయ నారాయణ మాస్టర్ విద్యనందించి ఎందరికో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు దోహద పడినారని, లెక్చరర్ గా, ఆదర్శ పాత్రికేయులుగా వన్నంపల్లి నారాయణ సేవలు మరువలేని అని కొనియాడారు. ఈ సమావేశంలో పాత్రికేయులు ఏ శ్రీనివాసులు, రావిక్రింది. రామారావు, కంబాలపల్లి శేఖర్ రెడ్డి, వెన్న వెంకటేశ్వర రెడ్డి, జి.గాలిరెడ్డి, రమణ, మంత్రు నాయక్, డోలు శ్రీకాంత్, దర్శనం పోలురాజు( బద్రి) మందా ఆదాము, దగ్గుల శివకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకొండి..ఎంపీడీవో నాసర్ రెడ్డి



**పెద్ద దోర్నాల, పెన్ పవర్ జనవరి 7**

2024-25 సంవత్సరానికి సంబందించిన బీసీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు ఈ నెల 8వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకోవాలని దోర్నాల ఎంపీడీవో నాసర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుచు మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్, వెదురు బుట్టల తయారీ, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దోర్నాల మండలానికి బీసీలకు 23 యూనిట్లు, ఈబీసీలకు 11 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాలయాల నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండలంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిఆయన తెలిపారు.

## అడవుల పరిరక్షణే మానవాళికి మనుగడ

**- అటవీ క్షేత్ర అధికారి మధుప్రియాంకా**

**అర్ధవీడు, పెన్ పవర్, డిసెంబర్ 0 7**

అడవుల పరిరక్షణే మానవాళికి మనుగడని తురమెళ్ళ అటవీ క్షేత్ర అధికారి మధుప్రియాంకా అన్నారు. మంగళవారం మండలంలోని పాపినేని పల్లె గ్రామంలో గ్రామ ప్రజలకు తురిమెల్ల రేంజ్ సిబ్బందికి, ప్రొటెక్షన్ వాచర్లకు అందరికీ అడవుల రక్షణ వణ్యప్రాణులు రక్షణ తీసుకోవలసిన జాగ్రత్తలను, అడవికి నిప్పు పెట్టుట మానవాళి మనగడకు ముప్పని తెలిపారు. ఎస్ టిఐహెచ్ ఎల్ కంపెనీ చిత్తూరు వారితో అడవులు కాలినప్పుడు ఆర్పుటకు ఏ విధమైన పరికరాలు ఉపయోగించవలసినది, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎస్ టిఐహెచ్ ఎల్ కంపెనీ వారి పరికరములతో ఏ విధముగా అడవులు కాలినప్పుడు ఆర్పే విధానంను ప్రాక్టికల్ గా డెమో ఏర్పాటు చేసి వివరించినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారావు, మాజీ ఎంపీటీసీ రంగయ్య అడవుల పరిరక్షణ ప్రస్తుతం అడవుల అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మధు ప్రియాంకతో పాటు పాపినేని పల్లె సర్పంచ్ పుల్లారావు మాజీ ఎంపిటిసి రంగయ్య , పాపినేనిపల్లి డిప్యూటీ ఆర్ వో మాల్యాద్రి, వెలగలపాయ డిప్యూటీ ఆర్ ఓ రంగారెడ్డి, ఏవి కోట డిప్యూటీ ఆర్ఓ బాలాజీ నాయక్ , పాపినేనిపల్లె ఎఫ్ బి ఓ లు మురళీకృష్ణ , కణ్యాణి ,ఆశా , అర్ధవీడు ఎస్సై సుదర్శన్ యాదవ్, ప్రొటెక్షన్ వాచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# రైతు సమస్య లపరిష్కారమే ప్రభుత్వ ఆశయం

**బ్రాహ్మణపల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో తాసిల్దార్ భాగ్యలక్ష్మి.**

**రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు.**

**అందిన అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి.**






**కొమరోలు పెన్ పవర్ జనవరి 7**

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించి రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమని కొమరోలు తాసిల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కొమరోలు మండలంలో గత నెల ఆరో తేదీ నుంచి నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులలో భాగంగా ఈనెల 7వ తేదీ మంగళవారం కొమరోలు మండలంలోని బ్రాహ్మణపల్లి లో తాసిల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు దాఖలు చేసేందుకు రైతులు తరలివచ్చారు .వారిని ఉద్దేశించి తాసిల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులు కోరుకుంటున్న భూ సమస్యలను సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించి రైతులకు సౌకర్యాలు కల్పించాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్ని రెవెన్యూ గ్రామాలలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించేందుకు ఆదేశించారన్నారు. ఆ మేరకు తాము కొమరోలు మండలంలో గత నెల ఆరవ తేదీ నుంచి గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామసభ నుంచి రైతుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. బ్రాహ్మణపల్లి రెవెన్యూ ఇలాకాలో 64 సర్వే నెంబర్లు ఉన్నాయని, వాటికి సంబంధించి రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని ఆమె రైతులను కోరారు. ఆ సందర్భంగా 11 మంది రైతులు అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని ఆమె రైతులకు తెలిపారు ఆ కార్యక్రమంలో మండల సర్వేయర్ పఠాన్ సిలార్ ఖాన్, విఆర్ఓ నాయబ్ రసూల్, వీఆర్ఏలు ,ఆ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకొండి

**పీసీ పల్లి పెన్ పవర్ జనవరి 7**

2024-25 సంవత్సరానికి సంబందించిన బీసీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు ఈ నెల 8వ తేదీ నుంచే దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్, వెదురు బుట్టల తయారీ, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పెద్ద చేర్లో పల్లి మండలానికి బీసీలకు 19 యూనిట్లు, ఈబీసీలకు 15 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాలయాల నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండలంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పేద వాళ్ళ సొంత ఇంటి కలను సాకారంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు

**- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బిఆర్ గౌస్**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**



గడిచిన 10 సంవత్సరాల కాలంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పేదవారికి టిడ్కో గృహాలు అందించటంలో తీవ్రంగా విఫలం అయ్యాయని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ బి.ఆర్ గౌస్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక చింతల దగ్గర 90 శాతం నిర్మాణం పూర్తయి దాదాపు ఏడు సంవత్సరాలు పాటు నిరుపయోగంగా ఉన్న టిడ్కో గృహాలను కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ బి ఆర్ గౌస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఆనాటి ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేశారని ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఒంగోలు నగరంలో పేదవారికి ఒక ఇల్లు కట్టించలేకపోయారని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగరంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల గృహాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన టిడ్కో గృహాలు దరఖాస్తులు కోరగా దాదాపు 16,126 మంది టీడ్కో ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకొని దాదాపు 21 కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించారని అందులో మొదటి విడతగా 6000 మంది లబ్ధిదారుల కొరకు స్థల సేకరణ జరిగి, నిర్మాణం మొదలుపెట్టి దాదాపు పూర్తికావచ్చిన గృహాలను ఎన్నికల నెపంతో ఆనాడు టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించకుండా ఎన్నికలకు వెళ్లిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్రింగ్ పేరుతో ఆ 6000 గృహాలను రివర్స్ టెండరింగ్ ద్వారా బిలో బేస్మెంట్ లెవెల్ ఉన్న1872 గృహాలను కొత్త కాంట్రాక్టర్కు కేటాయించిందని, ఆ గృహాల నిర్మాణాలు పూర్తయినప్పటికీ మౌలిక సదుపాయాలు లేక వాటిని లబ్ధిదారులకు కేటాయించలేకపోయిందని, అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన 6000 గృహాలు శిథిలావస్థకు చేరే పరిస్థితి వచ్చిందని , లబ్ధిదారుల పేరు మీద రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు లబ్ధిదారులకు నోటీసులు పంపిస్తున్నారని ,ఇప్పటివరకు కనీసం ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్తు సదుపాయాలు లేక పూర్తి అయిన కొన్ని గృహాలను కూడా లబ్ధిదారులకు కేటాయించ లేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారం వచ్చి ఆరు నెలలు దాటినప్పటికీ ఇంతవరకు టిట్కో ఇళ్లను పూర్తిచేసి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టి టిడ్కో గృహాలను మరమ్మత్తులు చేసి, నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కో చైర్మన్ వద్దండి మల్లికార్జునరావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు ఉంగరాల శ్రీను, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు రాయపాటి గిడియన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేటి మహేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దండుప్రోలు ప్రసాద్, షేక్ కరీం భాషా, షేక్ ఖాజా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మినీ ట్రాక్టర్లకు దరఖాస్తులు చేసుకోండి

## చేట్టిచర్ల గ్రామంలో పొలం పిలుస్తుంది





**బేస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 7**



సన్న చిన్న కారు రైతులు ఉద్యానవన శాఖ ద్వారా ఆసక్తి ఉన్న రైతులు మినీ ట్రాక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలని బేస్తవారిపేట ఉద్యాన వన శాఖ అధికారిని డి శ్వేత తెలిపారు. మంగళవారం చేట్టిచెర్ల లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతులకు 50 శాతం సబ్సిడీపై మినీ ట్రాక్టర్లు మరియు తైవాన్స్ పేర్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని కావున అవసరమైన రైతులు గ్రామ సచివాలయంలో సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం చిట్టి చర్ల గ్రామంలో రైతులు సాగుచేసిన బత్తాయి తోటలను మరియు మిరప తోటలను పరిశీలించారు. మిరప తోటలకు సాగుచేసిన రైతుల తో ఉద్యాన శాఖ అధికారిని డి శ్వేత మాట్లాడుతూ మిరప పంటలోఎక్కువగా కాయ కుళ్ళు, కొమ్మ ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు 1 ఎం ఎల్ ప్రోపికోన జోల్ లేదా0.5మిల్ డైఫేన్ కొనజోల్ లేదా 2.5 ఎం ఎల్%జి% కాపర్ హైడ్రాక్సైడ్ లేదా2.5జి సాఫ్ మందును లీటర్ నీటికీ కలిపి మందులను ఒకటి మార్చి ఒకటి వారం లో రోజులు రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. ఉద్యానవనయాంత్రీకరణ పథకం లో భాగంగా తైవాన్ స్ప్రేయర్లు 50% క్రింద మరియు మినీ ట్రాక్టర్లు 5 ఎకరాలు లోపల ఉన్న రైతులకు లక్ష రూపాయలు మించకుండా రాయితీ ఉందని ఉద్యాన అధికారి తెలియటం జరిగింది. వ్యక్తిగత నీటి కుంటలు ,మరియు ప్యాక్ హౌసులు కోత అనంతరం యాజమాన్య పద్ధతులు క్రింద 50 శాతం రాయితీ ఉందని కావున మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జక్కం మెర్సీ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్, గ్రామ ఉద్యాన సహాయకులు నాగజ్యోతి ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీర్చండి

కేవలం తాసిల్దార్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ,మండల సర్వేయర్ తో సాగుతున్న పాలన.

-ప్రధాన రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ ,ఇద్దరు అటెండర్లు, టైపిస్ట్ పోస్టులు ఖాళీ.

-దీర్ఘ కాలపు సెలవులో డిప్యూటీ తాసిల్దార్ ,ఒక జూనియర్ అసిస్టెంట్.

-ఉన్న సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా సేవలు అందిస్తున్నాం- తాసిల్దార్ భాగ్యలక్ష్మి.




**కొమరోలు పెన్ పవర్ జనవరి 7**

కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పడిన సిబ్బంది కొరతను తీర్చవలసిందిగా ప్రజలు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నారు. కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్ ,రీసర్వె డిప్యూటీ తాసిల్దార్, సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు ,మండల సర్వేయర్, టైపిస్ట్ ,ముగ్గురు అటెండర్లు రెగ్యులర్ ఉద్యోగులుగా పని చేయవలసి ఉన్నది .

అయితే ప్రభుత్వం చేపట్టిన సాధరణ బదిలీల్లో భాగంగా గత మూడు మాసాల క్రితం డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న మల్లికార్జున్ నాయుడును బదిలీ చేశారు .ఆయన స్థానంలో గిద్దలూరు తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న వెంకటయ్యను నియమించారు. అయితే ఇటీవల ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో సెలవుపై వెళ్లారు. డిప్యూటేషన్ పై రీ సర్వే డిప్యూటీ తాసిల్దారు గా పని చేస్తున్న షేక్ సలీం ను బదిలీ చేశారు .అయితే ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. దీనితో కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ పోస్టు గత మూడు మాసాలుగా ఖాళీగా ఉంటున్నది .రెండేళ్ల కితం వరకు ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టును రద్దు చేశారు .ఇక ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా వారిలో ఒకరు గత మూడు మాసాలుగా సెలవు ఉన్నారు .దీనితో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కాగా మండల రెవెన్యూ అధికారి పోస్టు గత దశాబ్ద కాలంగా ఖాళీగా ఉంటున్నది. దీనితో రేషన్ షాప్ ల

పర్యవేక్షణ కుంటుపడిందని తెలుస్తుంది .కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ డి పెద్ద దేవా నాయక్ ,జూనియర్ అసిస్టెంట్ గా ,ఆర్ఐగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. టైపిస్టు పోస్టు కూడా చాలా కాలంగా ఖాళీగా ఉంటున్నది. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ముగ్గురు అటెండర్లు పనిచేయవలసి ఉండగా గత రెండేళ్లుగా ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు .దీనితో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది తోపాటు వివిధ అవసరాల కోసం వస్తున్న ప్రజలకు కూడా అసౌకర్యంగా మారింది. తాసిల్దార్ కార్యాలయంలో ప్రస్తుతం తాసిల్దార్ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ పఠాన్ సిలార్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్లు దేవా నాయక్, రంగనాయకులు తోపాటు ఒక మహిళా అటెండర్ మాత్రమే పని చేస్తూ ఉన్నారు .ఔట్సోర్సింగ్ పద్ధతిపై కంప్యూటర్ ఆపరేటర్ గా ఉషారాణి, ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ గా రాజ్యలక్ష్మి పనిచేస్తున్నారు .ప్రధానంగా డిప్యూటీ తాసిల్దారు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ ,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ,సీనియర్ అసిస్టెంట్ కుర్చీలు ఖాళీగా ఉంటున్నందువల్ల అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు చెబుతున్నారు. గత డిసెంబర్ ఆరవ తేదీ నుంచి మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతున్నందువల్ల తాసిల్దార్ భాగ్యలక్ష్మి తో పాటు మండల సర్వేయర్, కొందరు సిబ్బంది రెవెన్యూ సిబ్బంది సదస్సులకు హాజరవుతున్నారు. దీనితో కార్యాలయంలో సిబ్బంది కొరత మరింత జటిలంగా మారిందని చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లుగా తాసిల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. కావున కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వి ఆర్ కోట అన్నేబోయినపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది



**లింగసముద్రం పెన్ పవర్, జనవరి 7**

మండల పరిధిలోని వి ఆర్ కోట అన్నే బోయినపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పత్తి ఎదుగుదలను సాధించుటకు ఒక ఎకరాకు 750 గ్రాములు విత్తం సరిపోతుందని విత్తన శుద్ధికి ఒక కేజీ విత్తనమునకు 10 గ్రాములు ట్రైకోడెర్మా వీరి లో విత్తన శుద్ధి చేసుకోవచ్చు అని తెలిజేశారు. పశు వైద్య సహాయకులు ఎస్.కె రూపియా మల్లు మాట్లాడుతూ సీజన్ వ్యాధులు వ్యాధులు ప్రబలకుండా పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎస్కే నజీరు ఎస్కే అహ్మద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల్ని పరిష్కరించుకోవాలి

**తహసిల్దార్ సీతా మహాలక్ష్మి**



**లింగసముద్రం పెన్ పవర్, జనవరి 7**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు తమ భూసంబంధమైన సమస్యలను పరిష్కరించుకోవాలని మండల తహసిల్దార్ సీతా మహాలక్ష్మి చెప్పారు. మంగళవారం మండలంలోని చినపవని, పెద్ద పవని గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సీత మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి భూ సంబంధమైన సమస్యలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని తహసిల్దార్ ఎస్ సీతా మహాలక్ష్మి కోరారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వివిధ సమస్యలను పరిష్కరించారు రెవిన్యూ సదస్సులో చిన్నపవని 14 పెదపావని 20 అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రమణయ్య సచివాలయం సర్వేయర్ సాయి. కిశోర్ వీఆర్వోలు మస్తాన్ వలి, బ్రహ్మయ్య, టిడిపి నాయకులు సోంపల్లి మనోహర్ గొర్రెపాటి శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సమాఖ్యలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

**కందుకూరు పెన్ పవర్ జనవరి 7**

ఈనెల 3,4,5 తేదీలలో హైదరాబాద్ నో హోటల్ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రముఖులు పారిశ్రామికవేత్తలు రాజకీయ నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి డాక్టర్ దివి శివరాం, దివి సౌభాగ్య, తోకల వెంకటేశ్వర్లు, మాదాల ఆదిశేషయ్య, మాదాల వెంకట్, కస్తాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.







## ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

*కోవూరు, పందలపాడులో పొలం పిలుస్తుంది*




**కందుకూరు పెన్ పవర్, జనవరి 7**

మండలంలోని కోవూరు, పందలపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి. రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. రాము మాట్లాడుతూ రైతులు ఎక్కువగా పొగాకు సాగు మీద మొగ్గు చూపుతున్నారు కావున పొగాకు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు అయిన శనగ, నువ్వు, పెసర,ధనియాలు ఇతర పంటలు వేసుకోవాలని ఒక పంటలో నష్టం వస్తే వేరే పంటలో ఆదాయం తీసుకోవచ్చని తెలిపారు, రబీ సీజన్లో వేసిన అన్ని పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. కోవూరు పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్ సుధాకర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పశు గ్రాసం పెంచుకొనే సన్న, చిన్న కారు రైతులకు అర ఎకరలోపు వున్నవారికి రూ 33000 సబ్సిడీ వుందని, అలాగే దాణా ఖర్చుల నిమిత్తం కిసాన్ క్రెడిట్ కార్డు వున్న వారికి బ్యాంక్ లో తక్కువ వడ్డీతో రుణాలు తీసుకోవచునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ పి మాధవ మాట్లాడుతూ ప్రతి రైతు కిచెన్ గార్డెన్ వేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంలో ఏటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ గురించి,సేంద్రీయ డి ఎ పి,సేంద్రీయ పొటాష్ గురించి వివరించారు.




అనంతసాగరం గ్రామంలో మినుము పంట లో కందుకూరు సహాయ గణాంక అధికారి కె .కృష్ణవేణి సమక్షంలో పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జె సి అగ్రహారంలో పదిమందిని కరిచిన వీధి కుక్కలు

**పట్టించుకోని పంచాయతీ అధికారులు**





బేస్తవారిపేట, పెన్ వర్ జనవరి 7:

బెస్తవారిపేట మండలం లోని జెసి అగ్రహారం గ్రామంలో వీధి కుక్కల దాడిలో దాదాపు పది మంది చిన్నారులు కుక్క కాటు గురి పలుచోట్ల చికిత్సలు పొందుతున్నారు. రెండు రోజుల్లో దాదాపు పది మంది చిన్నారులను కుక్కలు కరిచినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే కుక్కల దాడిలో గ్రామంలోని దాదాపు 30 కోళ్లను కుక్కలు చంపినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. చిన్నారులకు రాబిస్ వ్యాక్సిన్లు వేయించుకునేందుకు వారి తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రులకు తరలిపోతున్నారు. గ్రామంలోని పంచాయతీ సెక్రెటరీ మరియు సర్పంచ్ వీధి కుక్కలను గ్రామంలో లేకుండా చేయాలని జెసి అగ్రహారం గ్రామ ప్రజలు కోరుతున్నారు. వైద్య సిబ్బంది ఆ గ్రామంలో పర్యటించి కుక్కకాటు గురైన చిన్నపిల్లలకు ర్యాబిష్ వ్యాక్సిన్ లు అందించాలని జెసి అగ్రహారం గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# కావలి డిపోలో ఆదర్శ ఉద్యోగులుగా రాణిస్తున్న మహిళలు

**ఏపియస్ ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ**



**కావలి పెన్ పవర్ జనవరి 7**

కావలి డిపోలో మహిళా కండక్టర్లు ఆదర్శ ఉద్యోగులుగా రాణిస్తున్నారని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ గ్యారేజ్ లో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా అయన డిసెంబర్ నెలలో కావలి డిపో కండక్టర్లకు నిర్దేశించిన బస్సు ఆదాయపు లక్ష్యంలో 106 శాతం సాధించి కె రమాదేవి ప్రధమ స్థానం, 105 శాతం సాధించి ఐ సునీత రెండవ స్థానం, 104 శాతం సాధించి కె సుభాషిణి తృతీయ స్థానంలో నిలిచారని అన్నారు. వారికి డిపో మేనేజర్ నగదు బహుమతులు అందజేశారు. పురుష కండక్టర్లతో పోటీపడి మహిళా కండక్టర్లు అత్యధిక బస్సు కలెక్షన్ సాధించడం పట్ల తానేంతో గర్వపడుతున్నానని అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) కల్పన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ యం రామకృష్ణ, సెక్యూరిటీ అధికారి కె కె రావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి రవిప్రకాష్ , ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఇండోసాల్ సోలార్ ఉద్యోగుల రక్తదానం



**కావలి పెన్ పవర్ జనవరి 7**

కార్పొరేట్ సామాజిక భాద్యతగా తమ ఉద్యోగులు ప్రతీ సంవత్సరం రెండూ సార్లు రక్తదానం చేయాలనీ ముందుకు వచ్చారని చేవూరు గ్రామ పరిధిలోని ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మానవ వనరుల విభాగపు అధికారి సింహాద్రి హరీష్ పేర్కొన్నారు. మంగళవారం ఇండోసోల్ సోలార్ కంపెనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈరోజు శిబిరంలో 63 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ మానవ జీవితంలో రక్తదానం ఒక ముఖ్య భాద్యతగా భావించాలని, రక్తదానంకు ప్రత్యామ్నాయ సేవ మరొకటి లేదని, తమ కంపెనీ యాజమాన్యం రక్తదానాన్ని ప్రోత్సహస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్తుకూరులో అన్న క్యాంటీన్

**అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**బ్యూరో నెల్లూరు పెన్ పవర్ జనవరి 7**

ముత్తుకూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 65 లక్షలు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముత్తుకూరు లోని బస్టాండ్ సెంటర్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహానికి అదానీ కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ నిధులతో పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో కృష్ణపట్నం శ్రీ సిద్దేశ్వర, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాల నిధులతో కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా స్థల పరిశీలన చెప్పడం జరిగింది.

## టెన్త్ క్లాస్ 100 రోజుల ప్రోగ్రాం పరిశీలించిన ఎంఈఓ సిహెచ్ వెంకటసుబ్బయ్య

**కావలి పెన్ పవర్ జనవరి 7**

కావలి రూరల్ మండల పరిధిలోని గౌరవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ వెంకటసుబ్బయ్య (2) పదో తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రోగ్రాం తనిఖీ చేయడం జరిగింది. అనంతరం ఎంఈఓ సబ్జెక్ట్ టీచర్స్ యొక్క సిలబస్ ఉదయం స్టడీ అవర్స్ సాయంత్రం ఎగ్జామ్ కు సంబంధించిన అన్ని రికార్డు లను తనిఖీ చేశారు. విద్యార్థినీ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు తగు సలహాలను సూచనలను అందజేయడం జరిగింది.



# నా తొలి ప్రాధాన్యం గిరిజనుల అభ్యున్నతిపైనే

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి







**బ్యూరో నెల్లూరు పెన్ పవర్ జనవరి 7**

ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీ చిన్నసంఘం గిరిజన కాలనీలో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గిరిజనుల సమస్యలపై ఆరా తీయడంతో పాటు మనుమళ్లతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన బిడ్డలు కనీసం ఆధార్ కార్డులకు కూడా నోచుకోకపోవడం బాధాకరం అన్నారు. కనీస అవసరమైన ఆధార్ కార్డులు లేక గిరిజనులు రేషన్ కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు అని టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినాక నేను గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాను అని తెలిపారు. ఒక్క పైనాపురం పంచాయతీలో 70 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో పాటు 80 మందికి ఆధార్ కార్డులు నమోదు చేయించామని 17 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామని 43 మందికి అర్హత ఉన్నా ఓటు హక్కు లేదు 35 మందికి రేషన్ కార్డులు లేవు 18 మంది పింఛన్ పొందలేకపోతున్నారు అని సమాజంలో ప్రత్యేకంగా గిరిజనులే అన్యాయానికి గురవుతుండటం దురదృష్టకరం అని 12 మంది ఉద్యోగులతో గ్రామంలోనే సచివాలయం ఉండటంతో పాటు మండల స్థాయిలో అధికారులు ఉన్నా పేదల కనీస అవసరాలు తీర్చలేకపోడం సరికాదు అన్నారు. గిరిజనుల అవసరాలు తీర్చలేని సచివాలయాలు ఎందుకు అని జిల్లా స్థాయిలో గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మేం ఇటీవలే సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాం అని ఆ గ్రీవెన్స్ కార్యక్రమంలోనే వందలాది మందికి ఆధార్ కార్డులు నమోదు చేయడం జరిగిందని ఆధార్ కార్డు లేక పోతే భారత పౌరుడనే ఆధారం కూడా లేని పరిస్థితి ఉంటుందన్నారు. త్వరలోనే అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇళ్లు కట్టిస్తాం అని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడంతో పాటు గిరిజన కాలనీల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తామని గిరిజన బిడ్డలు తప్పనిసరిగా బడికి వెళ్లడంపైనా అందరూ శ్రద్ధవహించాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సమస్యకు పరిష్కారం

**శ్రీ కాళహస్తి – పెన్ పవర్, జనవరి 07**

శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చొరవతో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్యకు మంగళవారం పరిష్కారం లభించింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం పూడి–ఇలగనూరు మధ్య రోడ్డు నిర్మాణం చేయాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. వైసీపీ హయాంలో రాజకీయ కారణాలతో ఈ రోడ్డు చేయకుండా ఆ పార్టీ వారు అడ్డుకున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులుగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అయిన తరువాత ఈ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పూడి, ఇలగనూరు గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు తొట్టంబేడు రెవిన్యూ, పోలీసు శాఖల అధికారులను అక్కడకు పంపారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పాల సరఫరా సంఘం మాజీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు కూడా అక్కడకు వెళ్లారు. పూడి, ఇలగనూరు రైతులతో చర్చించారు. రోడ్డు నిర్మాణం వలన ఉపయోగం గురించి వివరించారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే తరపున ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు రైతులు రైతులు అంగీకరించారు. దీంతో పూడి–ఇలగనూరు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం అయింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొణతనేరి, గుర్రప్పనాయుడుకండ్రిగ, పూడి,ఇలగనూరు వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీర్ఘ కాలికంగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు ఆ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.



# విజేతగా నిలిచిన విక్రమ సింహపూరి యూనివర్సిటీ జట్టు



**కావలి పెన్ పవర్ జనవరి 7**

విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి జోన్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం కావలి పట్టణంలోని స్థానిక విక్రమసింపురి యూనివర్సిటీ కళాశాల నందు నిర్వహించడం జరిగినది. ఈ యొక్క ఫైనల్ కి జవహర్ భారతి కళాశాల జట్టు మరియు విక్రమసింపులు యూనివర్సిటీ కావలి కళాశాల వచ్చాయి. ఈ యొక్క ఫైనల్స్ కు ముఖ్య అతిథిగా కావలి క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మరియు జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు సిద్దు విచ్చేసి క్రీడాకారులు ఆటలతో పాటు చదువులో కూడా రాణించి మన యొక్క రాష్ట్రానికి మరియు దేశానికి మంచి కీర్తి ప్రతిష్ట లు తీసుకురావాలని కొనియాడారు. ముందుగా బ్యాటింగ్ చేసినటువంటి విక్రమసింపులు యూనివర్సిటీ కళాశాల జట్టు 15 ఓవర్లకి 110 రన్స్ చేయడం జరిగినది. చేజింగ్ చేసినటువంటి జవహర్ భారతి కళాశాల జట్టు15 ఓవర్లకి 105 రన్స్ చేశారు ఐదు రన్స్ తేడాతో విక్రమ సింహపూరి యూనివర్సిటీ కళాశాల జట్టు విజయం సాధించడం జరిగింది. అనంతరం విజయం సాధించినటువంటి జట్టుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి వీరారెడ్డి రెడ్డి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ పి ప్రసాద్ రెడ్డి,ఆర్గనైజర్ సెక్రెటరీ మణికంఠ, పీడీలు శ్రీనివాసులు తిరుపాలు,సీనియర్ క్రీడాకారులు రమణయ్య భాస్కర రావు,కొండలు తిరుమల పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బొజ్జల చొరవతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

**శ్రీ కాళహస్తి – పెన్ పవర్, జనవరి 07**

గత కొంత కాలంగా లో ఓల్టేజి సమస్యతో బాధపడుతున్న ఆ కాలనీ వాసులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చొరవతో సమస్య పరిష్కారం అయ్యింది. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ నందు నెలకొంటున్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి అంటూ కైలాసగిరి కాలనీ వాసులు విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నో సార్లు మొరపెట్టకున్నారు. కానీ ఫలితం లేకుండా పోయింది. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ ప్రజలు వోల్టేజ్ విద్యుత్ కారణంగా ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. దీనివలన ఇంట్లో లైట్లు వెలగకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడం చాలా ఇబ్బందులు పడేవారు. విద్యుత్ వినియోగం పెరగడంతో అక్కడ లో ఓల్టేజీ సమస్య బాగా పెరిందని, దీంతో ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కొన్ని కాలిపోతుండగా, మరి కొన్ని అసలు పనిచేయడం లేదని స్థానికులు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కోరగా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి మంగళవారం విద్యుత్ అధికారులతో మాట్లాడి 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు పోల్స్ నాటించి అక్కడ లైన్ లాగారు. దీంతో బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ నందు నెలకొన్న సమస్య పరిష్కారం అయ్యింది. అక్కడ స్థానికులు మాట్లాడుతూ మా సమస్యను ఎంతో మంది అధికారులతో మొరపెట్టుకున్నా ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదని, కనీసం వచ్చి చూడనూ లేదు అని వాపోయారు.



సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా అనిల్ కుమార్ యాదవ్



**పలమనేరు జనవరి 07,(పెన్ పవర్)**

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా పలమనేరు పట్టణానికి చెందిన అనిల్ కుమార్ యాదవ్ కు రాష్ట్రబీసీ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు.ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులుగా అనిల్ కుమార్ యాదవ్ ఎన్నిక కావడంతో పట్టణంలోని పలువురు అయనను కలిసి అభినందించి,శాలువా కప్పి సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అందించిన రాష్ట్ర,జిల్లా,మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసిన రామిరెడ్డి



**కావలి పెన్ పవర్ జనవరి 7**

కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మంగళవారం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొద్దిసేపు రాజకీయాల గురించి చర్చించుకున్నారు. రాబోయే రోజుల్లో మరల వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అలాగే ఎన్డీఏ కూటమి అబద్దాలతో అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు.

# వాహనదారులు త్రైమాసిక పన్ను చెల్లించాలి

**– ఉప రవాణా కమీషనర్ ఆర్. సుశీల**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 07**

ప్రకాశం జిల్లాలోని రవాణా సేవలు అన్ని వాహన్ సైట్ లోకి మారినందువలన ప్రతి వాహనదారులు అనగా లారీ, కాంటాక్ట్ క్యారేజి బస్సులు, ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషనల్ బస్సులు, మ్యాక్సీ క్యాబులు, ట్రైలర్స్ కమర్షియల్ పర్సన్ పర్మిట్ కలిగినటువంటి ఇతర సంబంధిత రవాణా వాహనములు ప్రతి వాహనదారులు త్రైమాసిక పన్నును సకాలంలో చెల్లించుటకు మొదటిగా ప్రతి ఒక్కరూ వాహన్.ఎన్ఐసి నందు ఈ–కేవైసీ, మండల్ మ్యాపింగ్, మొబైల్ అప్డేషన్ చేయించాలని తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారులు త్రైమాసిక పన్ను యొక్క చివరి తేదీ జనవరి 31 వరకు వేచి ఉండక త్వరగా వాహన్. ఎన్ఐసి వెబ్ సైటు నందు అప్డేట్ చేసుకొని ముందస్తుగా త్రైమాసిక పన్ను చెల్లించవలసిందిగా కోరారు.





పెన్ పవర్
నెల్లూరు | తిరుపతి | చిత్తూరు



# 'స్వర్ణమ్మ'పై రాబంధులు

## విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు
## హద్దులు దాటుతున్న తెల్లబంగారం
## రాళ్లు తేలి కళావిహీనంగా స్వర్ణముఖి నది
## నియంత్రణ పట్టించుకోని అధికారులు









**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జనవరి 07**

రాబంధుల కబంధ హస్తాల్లో చిక్కుకుని స్వర్ణమ్మ బంధీ అయ్యింది. విడిపించే వారు లేక కళ తప్పిపోతోంది. కనికరం లేకుండా గాయాలు చేస్తూ ఎక్కడికక్కడ సాగుతున్న తవ్వకాలతో గోతులమయమై ఇసుక రేణువులతో నిండుగా కనువిందు చేసే స్వర్ణముఖీనది రాళ్లు తేలి కళావిహీనంగా మారుతోంది. ఇక్కడి తెల్లబంగారాన్ని రాబంధులు హద్దులు దాటిస్తున్నాయి. నియంత్రించాల్సిన వారు మిన్నకుండిపోతుండడంతో తెల్లబంగారం కరిగిపోతోంది. భవిష్యత్తుకు ముప్పు పొంచివున్నా పట్టించుకోకుండా తమపని తాము చేస్తూ కోట్ల రూపాయలను గడిస్తున్నారు. శ్రీకాళహస్తిలో సాగుతున్న ఇసుక దోపిడీపై పెన్ పవర్ ప్రత్యేక కథనం. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తరంగా పవిత్ర స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఎక్కడో చిత్తూరు వద్ద పుట్టిన స్వర్ణమ్మ అక్కడి నుంచి నెల్లూరు జిల్లా నాయుడుపేట వరకు సాగి చివరగా సముద్రంలో కలిసిపోతోంది. ఈ మధ్యన రాబంధులుగా మారిన ఇసుకాసురులు స్వర్ణమ్మను దోచేస్తున్నారు. విచ్చలవిడిగా ఎక్కపడితే అక్కడ తవ్వకాలు చేస్తూ ఇసుకను హద్దులు దాటిస్తున్నారు. ప్రధానంగా పట్టణ పరిధి నుంచే అధికంగా ఇసుక రవాణా జరుగుతోంది. శ్రీకాళహస్తీశ్వరాలయ నాలుగో గేటు సమీపం నుంచి స్వర్ణముఖి నదిలోకి మార్గం ఉంది. ఇక్కడ యధేశ్చగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను పట్టణ ప్రధాన వీధుల గుండా రవాణా చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ రవాణాలో కొంత మంది రాజకీయ నాయకులతోపాటు మరికొంత మంది మీడియాకు సంబంధిన వారు కూడా ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**హద్దులు దాటించి కోట్లు గడిస్తూ...**

శ్రీకాళహస్తి మీదుగా స్వర్ణముఖి నది నుంచి ఇసుకను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రధానంగా చెన్నయ్ కు అక్రమ రవాణా జరుగుతోంది. ట్రాక్టరు ద్వారా తరలిస్తున్న ఇసుకను నిర్మాణాలు చేసుకునే వారి వద్ద నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో దూరాన్ని బట్టి ఆ మొత్తం పెరుగుతోంది. ఇదికాకుండా శ్రీకాళహస్తి శివారు, సత్యవేడు నియోజకవర్గ ప్రాంతాల వద్ద రహస్య ప్రదేశాల్లో డంపింగ్ చేసిన చోటునుంచి రాత్రి సమయాల్లో రోజుకు పది నుంచి పదహైదు టిప్పర్ల ఇసుక రాష్ట్ర సరిహద్దులు దాటించి తమిళనాడులోని చెన్నయ్ కు రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఒక టిప్పరుకు నాలుగు నుంచి ఆరు ట్రాక్టర్ల ఇసుక నింపుతారు. ఈ టిప్పరు ధర చెన్నయ్ లో రూ. 1.25లక్షలు పలుకుతోంది. ఇలా రోజుకు తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణా చేయడం ద్వారానే రోజుకు రూ. 50లక్షలకుపైగా సొమ్ము చేసుకుంటున్నారు. మొత్తంగా నెలకు సరాసరినా కొన్ని కోట్ల రూపాయలను ఇసుక అక్రమ రవాణా ద్వారా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**కళావిహీనంగా స్వర్ణముఖి నది..**

స్వర్ణముఖీ నదిలో ఎక్కడికక్కడ సాగుతున్న ఇసుక తవ్వకాలో స్వర్ణముఖినది కళావిహీనంగా మారుతోంది. నాడు శ్రీకాళహస్తీశ్వరాలయ నిర్మాణ పనుల్లో కూలీలకు బంగారు కాసులను కానుకగా ఇచ్చి సన్నటి ఇసుక రేణువులతో కనువిందు చేస్తున్న స్వర్ణమ్మ ఇప్పుడు పూర్వవైభవాన్ని కోల్పోయి రాళ్లు తేలి కనిపిస్తోంది. ఇసుకాసురులు తమ స్వలాభాపేక్షతో చేస్తున్న తవ్వకాలతో నదిలో ఇసుక రేణువులు కనుమరుగు అవుతున్నాయి. నిర్మాణాల్లో పూతలకు ఉపయోగపడే సన్నటి ఇసుక రేణువుల కోసం భవిష్యత్తు ముప్పును కూడా పట్టించుకోకుండా వంతెనల కింద ఫిల్లర్లచుట్టూ కూడా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని బావులు, బోర్లలో ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు దిగువకు పడిపోతున్నాయి.

## లక్కమనేని సన్నిహితులు జైపూర్ వాసుల భక్తి భావం

# వెంకన్నకు బంగారు అభరణాలు భక్తులకు అన్నదానం

**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జనవరి 07.**

కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీవెంకటేశ్వరస్వామివారికి త్వరలో బంగారు అభరణాలను కానుకగా ఇవ్వనున్నట్లు జైపూర్ వాసులు తెలిపారు. రెండు కేజీల బరువున్న ఈ అభరణాల విలువ రెండు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని చెప్పారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నాయకులు లక్కమనేని మధుబాబుకు జైపూర్ కు చెందిన అరవింద్ సోని అత్యంత సన్నిహితులు. వీరి మధ్య ఎప్పటి నుంచో మంచి స్నేహం, అనుబంధం కొనసాగుతోంది. మధుబాబు సూచనలతో తిరుమలేశుని దర్శనార్థం ఇదివరకు ఇక్కడకు వచ్చిన వారికి ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని వెళ్లిన వారికి అనుకున్న పనులు నెరవేరాయి. ఈ విషయాన్ని మధుబాబు దృష్టికి జైపూర్ వాసులు తీసుకొచి కానుకలు సమర్పించాలని చెప్పారు. అప్పుడు బంగారు అభరణాలను శ్రీవారికి కానుకగా ఇవ్వాలనే మధుబాబు సూచనలతో ఆ మేరకు నిర్ణయం తీసుకుని మళ్లీ శ్రీవారి దర్శనానికి వచ్చిన జైపూర్ వాసులు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కానుకలు ఇవ్వానికి వారి నుంచి అనుమతి తీసుకున్నారు. రెండు కేజీల బరువైన ఈ అభరణాల విలువ రెండు కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అంచనా వేశారు. వీటిలో మూలవర్ల అశ్వర్థ పత్ర హారము, ఉత్సవర్లకు సాతుబడి అయ్యే ఏనుగు గొలుసు తదితర అభరణాలు ఉన్నట్లు చెప్పారు. తర్వాత శ్రీవారి సేవలో పాల్గొని శ్రీనివాసుని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 1000 మంది వెంకన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. వెంకన్న పై వీరికున్న దైవ భక్తుని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కమనేని మధుబాబు, ఆయన ముఖ్య అనుచరులు తదితరులు పాల్గొన్నారు.



## తహసిల్దార్ కార్యాలయంలో

# పెట్రోల్ బంకు వద్దు

## జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు





**బ్యూరో పెన్ పవర్ నెల్లూరు జనవరి 7**

నెల్లూరు జిల్లాలోని కావలి పట్టణంలో తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కావలి తెలుగుదేశం పార్టీ శ్రేణులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో చేపట్టిన నిర్మాణ పనులను వారు అడ్డుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆనంద్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో సబ్ రిజిస్టర్ ఆఫీసు, రూరల్ పోలీస్ స్టేషన్, సబ్ ట్రెజరీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయం, వాతావరణ శాఖ కార్యాలయం, సబ్ జైలు, వ్యవసాయ శాఖ కార్యాలయం, తదితర కార్యాలయాలు ఉన్నాయని, నిత్యం వేల మంది ప్రజలు కార్యాలయానికి వస్తుంటారని, పార్కింగ్, ఇతర కార్యక్రమాలకు పెట్రోల్ బంకు ఇబ్బంది అవుతుందని వారు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం, నాటి అధికారులు అనాలోచితంగా ఆలోచించి ఈ ప్రతిపాదన తీసుకురావడం జరిగిందని మండిపడ్డారు. ఇంత రద్దీగా ఉండే కార్యాలయంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో మరింత ట్రాఫిక్ పెరిగి ప్రజలకు, స్థానిక కార్యాలయాల సిబ్బందికి చాలా అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య, ఆర్యవైశ్య రాష్ట్ర డైరెక్టర్ తటపర్తి వాసు, దావులూరి దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి వర్గంలోకి బొజ్జల?

## ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి అవకాశం

## విస్తరణలో సుధీర్ కు వరించనున్న అదృష్టం- కలిసి వస్తున్న సమీకరణాలు



**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జనవరి 07**

ఏపీ మంత్రి వర్గ విస్తరణ త్వరలో జరగనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రేసులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఖరారుపై అధిష్ఠానం నుంచి స్పష్టత వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో శ్రీకాళహస్తిలో కూటమి నేతల్లో హర్షాతి రేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతి తర్వాత జరిగే ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ విస్తరణపై ఇప్పుడు చర్చంతా ఎవరు ఉండబోతారనే దానిపై జరగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో ఎవరికీ స్థానం దక్కలేదు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మినహా జిల్లా నుంచి ఎవరూ మంత్రి వర్గంలో లేరు. ఇప్పుడు రెండో విడత జరిగే మంత్రి విస్తరణలో స్థానం లభించే అవకాశం ఉంది. ఈ రేసులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో నారా చంద్రబాబు నాయుడుకు మధ్య విడదీయరాని అనుబంధం ఉంది. ఆ అనుబంధాన్ని శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన సందర్భంగా పలుమార్లు స్వయంగా చంద్రబాబు ప్రస్తావించారు. ఆయన వారసునిగా సుధీర్ రెడ్డిని తీసుకురావాలనే సంకల్పంతో తొలిసారి ఓటమి చెందినా రెండో దఫా ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొన్నా బొజ్జల కుటుంబానికే అభ్యర్థిత్వాన్ని కేటాయించారు. బాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా రికార్డు స్థాయి మెజారిటీతో సుధీర్ రెడ్డి తిరుగులేని విజయం సాధించారు. అంతకుముందు మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విజయవంతం చేయడంలో సుధీర్ రెడ్డి సఫలీకృతమయ్యారు. అప్పటి వరకు వారి మధ్యనున్న అనుబంధం మరింత బలపడింది. బొజ్జల కుటుంబంపై చంద్రబాబుకు ఉన్న అనుబంధం.. లోకేష్ ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతోపాటు యువనేత బొజ్జల సుధీర్ రెడ్డికి అదృష్టం వరించడానికి అవకాశాలుగా చెబుతున్నారు. దానికితోడు ఈ దఫా మంత్రి వర్గంలో యువతకు పెద్దపీత వేయాలనే ఆలోచన, ఉన్నత విద్యావంతుడు కావడంతోపాటు వ్యవస్థలపై మంచి పట్టుండడం కూడా సుధీర్ కు కలిసొచ్చే అవకాశంగా చర్చ నడుస్తోంది. ఇందుకు గెలిచిన వెంటనే ముక్కంటి ఆలయ ప్రక్షాలన ద్వారా శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి ప్రణాళికలతోపాటు ఆదాయాన్ని గణీయంగా పెంచడం, పాలనా వ్యవహారాల్లో సమర్ధతపై కూడా అధిష్ఠానం నిర్వహించిన సర్వేలో గుర్తించడంతో అవకాశాలపై అనుకూల పవనాలు వీస్తున్నాయి. దీనికితోడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి జిల్లా కూడా ఉండడం ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు కలిశాయి. దీంతో సామాజికవర్గాల సమీకరణలో కూడా సుధీర్ రెడ్డి బెర్తు ఖరారుపై స్పష్టత వస్తోన్నట్లు చెబుతన్నారు. అధిష్ఠానం మొగ్గు కూడా బొజ్జలపైనే ఉన్నట్లు ఇప్పటికే జోరుగా ప్రచారం సాగుతుండడంతో శ్రీకాళహస్తి కూటమి నేతల్లో హర్షాతీరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మేరకు ఖరారుపై స్పష్టత వచ్చినా సాగుతున్న ప్రచారంలో బొజ్జలకు వరించే అదృష్టంపై మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే.

# క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను అందజేసిన తలపా దామోదరం రెడ్డి

**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, జనవరి 07**

శ్రీకాళహస్తి పట్టణం బృందావన కాలనీ నందు గల యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేసి యువతకు క్రీడల యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంత ముఖ్యమని యువత చెడు దోవ పట్టకుండా మంచి అలవాట్లు వైపు నడవడానికి క్రీడలు ఎంత దోహదం చేస్తాయని ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకొని క్రీడల్లో పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంటోనీ, చందు, శంకర్, నాగరాజు, అరుణ్, చంద్రు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.



# మొదలైన మోడీ గేమ్...



**విజయవాడ, జనవరి 7, పెన్ పవర్::** ఆంధ్రప్రదేశ్ లో నరేంద్ర మోదీ గేమ్ మొదలయినట్లే కనిపిస్తుంది. నరేంద్ర మోదీని ఆషామాషీగా అనుకోవడానికి వీలులేదు. ఆయన దూర దృష్టితో ఆలోచించి ఏ రాజకీయ నిర్ణయమైనా ఉంటుంది. అంతే తప్ప తాత్కాలికంగా ఎటువంటి డెసిషన్లు ఉండవు. అదే సమయంలో మనతో మోదీ అనుకూలంగా ఉన్నారనుకోవడం కూడా అంతే తప్పు అవుతుంది. ఎందుకంటే తనకు ఇబ్బందిగా మారతారనుకున్న వారిని మోదీ కట్టడి చేయడానికే ఎక్కువ ప్రయత్నం చేస్తారన్నది దాదాపు దశాబ్దన్నర జాతీయ రాజకీయాలు చూసిన వారికి ఎవరికైనా ఇలాగే తెలుస్తుంది. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడాల్సి వచ్చింది. ఆయన పైకి ఇద్దరితో నవ్వుతూ కనిపించినప్పటికీ లోలోపల మాత్రం ఇద్దరినీ రాజకీయంగా కొంత అణిచివేసే ప్రయత్నం చేస్తారన్నది రాజకీయ వర్గాల్లో సాగుతున్న విశ్లే?షణలు బట్టి అర్థమవుతుంది. అందులోనూ చంద్రబాబు లాంటి సీనియర్ నేతను కంట్రోల్ చేయడం మోదీకి అవసరం అని మోదీ ఖచ్చితంగా భావిస్తారు. చంద్రబాబు నిజానికి మోదీ కంటే సీనియర్ నేత. రాజకీయాల్లో మోదీతో పా?టు ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అయితే అనేకసార్లు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తెగదెంపులు చేసుకోవడం ఆయనకు అలవాటు. నితీష్ కుమార్ కూడా అంతే. అందుకే ఇద్దరు సీనియర్ నేతలను మోదీ నమ్మే అవకాశమే లేదు. అందుకే జమిలి ఎన్నికలకు వెళ్లినా వీరిద్దరి విషయంలో ఒకింత జాగ్రత్త పడతారంటున్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్ లలో ఒకింత ఇద్దరు నేతల గ్రిప్ ను తగ్గించేందుకు మోదీ ప్రయత్నిస్తారన్నది తెలుగుదేశం పార్టీ నేతలు సయితం అనుమానిస్తున్నారు. తనను శాసించే పరిస్థితిని మోదీ తెచ్చుకోరు. తన చేయి పైన ఉండాలని, తనను ఒకరు యాచించాలి తప్ప డిమాండ్ చేయడం మాత్రం ఆయన సహించలేరన్నది మోదీ నైజం తెలిసిన వారు ఎవరైనా ఒప్పుకునే విషయం. అందుకే ఈ ఇద్దరు సీనియర్ నేతలైన నితీష్ కుమార్, చంద్రబాబుల విషయంలో మోదీ ఇప్పటికే స్కెచ్ వేసి ఉంటారన్నది భావిస్తున్నారు. వారిని రాజకీయంగా కొంత బలహీనం చేయగలిగితేనే పది కాలాల పాటు పాలన సాగించవచ్చన్న ఆలోచన సహజంగానే మోదీలో ఉంటుందని చెబుతున్నారు. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ లో హైలెట్ చేయాలని మోదీ భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కొంతకాలం ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే కాకినాడ పోర్టు పైన పడటం కూడా ఒకింత ఢిల్లీ వ్యూహమేనన్న వారు కూడా లేకపోలేదు. అయితే అందులో నిజమెంత? అన్నది పక్కన పెడితే.. చంద్రబాబు గతంలో మాదిరిగా మోదీని డిమాండ్ చేయలేరు. ఎందుకంటే ఏపీలో పవన్ అవసరం చంద్రబాబుకు ఉంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరోసారి పవన్ తో కలసి ప్రయాణం చేస్తేనే అధికారం దక్కుతుంది. ఆ వీక్ నెస్ తోనే పవన్ ను మోదీ మంచి చేసుకుంటున్నారు. వీలయినప్పుడల్లా పవన్ ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ కు ఢిల్లీ స్థాయిలో ఒక రోడ్ మ్యాప్ ను కూడా రూపొందించే అవకాశాలున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ అత్యధిక స్థానాలను కోరే ఛాన్స్ తో పాటు సీఎం సీటు షేరింగ్ విషయంపై కూడా ఒప్పందం చేసుకోవాలన్న ప్రతిపాదన తీసుకు వచ్చినా ఆశ్చర్యం లేదన్నది రాజకీయవర్గాల అంచనాగా వినిపిస్తుంది. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు అయితే.. మోదీ అంతకు మించి. చంద్రబాబు భయం కూడా అదే. మోదీని వదిలి పవన్ బయటకు రారు. అలా ఫిక్స్ చేయడంలో నరేంద్ర మోదీ ఇప్పటికే సక్సెస్ అయినట్లు ఏపీ రాజకీయాలు పరిశీలించిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. మొత్తం మీద దక్షిణాదిలో పట్టు పెంచుకోవాలంటే ఏపీలో గ్రిప్ సంపాదించాలన్న మోదీ ఆలోచనతో పవన్ కు రానున్న కాలంలో మరింత ప్రయారిటీ ఇస్తారన్న అంచనాలు వినపడుతున్నాయి. రేపు ఎనిమిదోతేదీన విశాఖ పర్యటనలో కూడా మోదీ పవన్ కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలున్నాయిఅందుకేచంద్రబాబు నాయుడు పెద్దగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో డిమాండ్ చేయలేని పరిస్థితి ఉంది. కూటమితోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్న చంద్రబాబు ఈసారి మాత్రం పవన్, మోదీలను దూరం చేసుకునే ఆలోచన చేయరు. రాజధాని అమరావతి నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వలేదు. కేవలం ప్రపంచ బ్యాంకు రుణం ఇచ్చేందుకు మాత్రమే సహకారం అందించింది. అదే సమయంలో జగన్ విషయంలోనూ ఒకింత మోదీ సాఫ్ట్ కార్నర్ లో ఉన్నారని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబును కొంత కట్టడి చేయాలంటే జగన్ ను ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అదే జగన్ ధైర్యం అని కూడా అంటున్నారు. ఇటీవల అమిత్ షాతో విజయసాయిరెడ్డి సమావేశం కూడా అందులో భాగమేనంటున్నారు. అలాగే జగన్ కేసుల విషయంలో కూడా ఎటూ తేల్చుకుండా చూసి చంద్రబాబుకు చెక్ పెట్టడమే కమలం పెద్దల ఆలోచనగా ఉందన్న టాక్ కూడా బలంగా వినిపిస్తుంది. మొత్తం మీద కూటమి కలిసి ఉన్నప్పటికీ బలమైన నేతలను బలహీన పర్చే యత్నాలు మాత్రం ప్రారంభమయ్యాయనే అంటున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం



**విశాఖపట్టణం, జనవరి 7, పెన్ పవర్::** ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది. వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడ దీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు. డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద సరుకు రవాణా ఆదాయం ఆర్జిస్తున్న కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ సహా 1,052 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాలను కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఇకపై కొత్త జోన్‌లో భాగం కానుంది. వాల్తేరు డివిజన్‌లో 300 డీజిల్ లోకోమోటివ్‌లను ఉంచే సామర్థ్యంతో భారతీయ రైల్వేలో అతిపెద్ద డీజిల్ లోకో షెడ్ ఉందని, లోడింగ్ లో 75 మిలియన్ టన్నుల మార్కును దాటిన డివిజన్ గా, 2024 మార్చి 31 నాటికి రూ.10,000 కోట్ల ఆదాయాన్ని దాటిన డివిజన్ గా గుర్తింపు ఉంది. వాల్తేరు జోన్ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే, సరుకు రవాణా విభాగాల్లో ఒకటిగా నిలిచిందని, రాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఒడిశా ప్రాంతాలైన జరికెలా, బండముండా, రూర్కెలా, ఝూర్సుగుడా, బెల్పహాడ్, కియోంఝర్, మయూర్భంజ్, బాలాసోర్ జిల్లాలను ఈస్ట్ కోస్ట్ రైల్వేలకు బదిలీ చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది. ఈ మార్పు ఒడిశా ప్రయోజనాలను కాపాడుతుందని, రాష్ట్ర ఆర్థిక అవకాశాలను మెరుగు పరుస్తుందని బీజేడీ భావిస్తోంది. రాష్ట్రంలో రైల్వే జోన్లను సమగ్రంగా సమీక్షించాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం ఆగ్నేయ రైల్వే పరిధిలో ఉన్న బాలాసోర్, మయూర్భంజ్ మరియు కియోంఝర్ వంటి జిల్లాలను కలిగి ఉన్న ఉత్తర ఒడిశాలో కొత్త డివిజన్ను సృష్టించాలని ఆ పార్టీ ప్రతిపాదించింది. ప్రస్తుతం చక్రధర్పూర్ డివిజన్లో భాగంగా ఉన్న ఝూర్సుగూడ మరియు సుందర్గఢ్లను కలుపుతూ కొత్త రూర్కెలా డివిజన్ను ఏర్పాటు చేయాలని పార్టీ ప్రతిపాదించింది. ఈ చర్యలు ఒడిశాలో మెరుగైన పరిపాలనకు, మెరుగైన రైల్వే సేవలకు దోహదం చేస్తాయని బీజేడీ నేతలు తెలిపారు. వాల్తేరు డివిజన్ ఈసీవోఆర్ నుంచి విడిపోయినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనం వహించారని మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ విమర్శించారు. ఒడిశాను ప్రభావితం చేసే కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించారు. ఒడిశాలోని మల్కన్ గిరి ప్రాంతంపై ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోని వివాదాస్పద పోలవరం ప్రాజెక్టుకు రూ.12,000 కోట్లు కేటాయించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ లలో రాజకీయ మిత్రపక్షాల ప్రయోజనాలకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ధోరణిపై బిజెడి అభ్యంతరం చెబుతోంది. 20 మంది లోక్ సభ ఎంపిలతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి దోహదపడిన ఒడిశాను పక్కన పెట్టడాన్ని బీజేడీ నేతలు తప్పు పడుతున్నారు

# జెండా మోసేదెవరు...

**ఒంగోలు, జనవరి 7, పెన్ పవర్:** బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ నియోజకవర్గంలో లేకుండా అడ్రస్ లేకుండా పొయ్యారు. ఎన్నకల ఫలితాలు వెలువడగానే ఫ్లైట్ ఎక్కేసిన ఆయన అమెరికాలో సొంత వ్యాపారాలు చూసుకుంటూ పార్టీ వ్యవహారాలను పట్టించుకోవడమే మానేశారంట. దాంతోపర్చూరు నియోజకవర్గంలో వైసిపి జెండా మోసే నాయకుడు కరువయ్యాడు. పర్చూరుకు కొత్త ఇన్జార్జిని నియమించాలనీ వైసిపి అధిష్టానం చూస్తుందట. ఇప్పటికే పార్టీ ఆవిర్భావం నుంచి నలుగురు ఇన్‌ఛార్జులను మార్చిన వైసీపీ ఈ సారి లోకల్ వ్యక్తులనే నియమించాలని చూస్తుందట. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్ రెడ్డిని నియమించాలన్న ఆలోచనలో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల పులివెందులకు వచ్చిన జగన్ ప్రస్తుత ఇన్చార్చ్‌గా ఉన్న యడం బాలాజీకి కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తునట్లు సమాచారం ఇచ్చారట. గాదే మధుసూదన్ రెడ్డి సొంత ఊరు పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు మండల పరిధిలోకి వస్తుంది .. ఇటు మాజి మంత్రి గాదే వెంకటరెడ్డి పలు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన అనుభవంతో పాటు ఆ కుటుంబానికి నియోజకవర్గంలో సొంత క్యాడర్ కూడా ఉంది.. దాంతో పర్చూరు వైసీపీ బాధ్యతలను గాదే కుటుంబానికి అప్పగించాలని జగన్ ఆలోచిస్తున్నారంట. వైసిపి పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు పర్చూరు నియోజకవర్గంలో బోణి కొట్టలేదు. వరుస ఓటములతో నియోజకవర్గంలో వైసీసీ బలహీనంగా మారిపోయింది. పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించగా కాంగ్రెస్ నాలుగు సార్లు విజయం సాధించింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగురుతుంది. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అభ్యర్థులను మార్చి మార్చి ప్రయోగించినా వైసీపీ విజయం సాధించలేకపోయింది. నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ ప్రతిసారి ప్రయోగాలతో కొత్తవారిని బరిలోకి దింపినా విజయం సాధించలేకపోయింది. ఎన్నికల సమయంలో వచ్చిన కొత్త నేతను స్థానిక క్యాడర్ వ్యతిరేకించడంతో పాటు సదరు అభ్యర్థికి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు సమయం సరిపోయేది. అందుకే నియోజకవర్గంలో ఒక్కసారి కూడా వైసీపీ విజయం సాధించలేకపోయిందన్న అభిప్రాయం ఉంది. ప్రధానంగా నియోజకవర్గంలో బలమైన నేతగా ముద్రపడ్డ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వైసీపీ ఎదుర్కోలేకపోయింది. 2014 ఎన్నికల నుంచి మొన్నటి ఎన్నికల దాకా హ్యాట్రిక్ విజయాలతో పర్చూరులో తిరుగులేని నేతగా ఎదిగారు ఏలూరి సాంబశివరావు. 2014 ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు ఆ తరువాత సొంత ఇమేజ్ ను పెంచుకుంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ పార్టీ హవా నడిచిన నియోజకవర్గంలో ఏలూరు సాంబశివరావు గెలుపును అడ్డుకోలేకపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు పై సాంబశివరావు గెలుపొందారు.

# గోదావరి జిల్లాల్లోబరులు సిద్ధం

**రాజమండ్రి, జనవరి 7, పెన్ పవర్::** రాష్ట్రంలో సంక్రాంతి పండగ అంటే ఫస్ట్ గుర్తొచ్చేది కోడి పందేలు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిన ఈ పందేల కల్చర్.. ఇప్పుడు చాలా జిల్లాలకు పాకింది. ఒకప్పుడు సరదాగా సాగిన కోడి పందేలు.. ఇప్పుడు మంచి బిజినెస్ అయ్యిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందుకే చాలామంది కోళ్లను పెంచడం, వాటిని విక్రయించడం, బరులు నిర్వహించడం ద్వారా కోట్లాది రూపాయలు కూడబెడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. నిర్వాహకులు కోళ్ల పందెం కట్టినందుకు కొంత, గెలిచిన వారి నుంచి కొంత వాటా తీసుకుంటారు. అంతేకాకుండా బరుల వద్ద సైకిల్, టూవీలర్ పార్కింగ్ నుంచి మద్యం, ఇతర దుకాణదారుల వరకు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. దీంతో పందేల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అతి తక్కువ రోజుల్లో కోట్లు రూపాయలు కూడబెట్టుకునే అవకాశం ఉండటంతో.. వివిధ జిల్లాల్లో ఈ సంస్కృతి పెరుగుతోంది. పండగ సంప్రదాయం పేరుతో పందేలు నిర్వహిస్తుండటంతో.. ఆపేవారు ఉండరని నిర్వాహకులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి నుంచే బరుల ఏర్పాట్లు ప్రారంభించారు. మరోవైపు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కోడి పందేలను చూడటానికి, పందేలు కాయడానికి ఏపీలోని ఇతర జిల్లాలతో పాటు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి సినీ నటులు, బడా వ్యాపారులు వస్తారు. కేవలం పండగ రోజుల్లోనే కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయనే టాక్ ఉంది. ఈ ఏడాది.. 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు కోడి పందేల నిర్వహించడానికి ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు. పంట పొలాలను చదును చేసి.. చుట్టూ కంచె వేస్తున్నారు. అక్కడే టెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల కోసం మట్టి రోడ్లు వేస్తున్నారు. కోడి పందేలకు వచ్చే వారి కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. బిర్యానీ, భోజన హోటళ్లు, బెల్ట్ షాపులు ఉండేలా చూసుకుంటున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి నుంచి కూడా నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. గతంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పందేలు ఉండేవి. ఇప్పుడు ఇతర జిల్లాల్లోనూ పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతో పందెం కోళ్లకు బాగా డిమాండ్ పెరిగింది. కేవలం సంక్రాంతి కోసమే ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచేవారు పెరిగారు. ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉందని పెంపకందారులు చెబుతున్నారు. కోడి పందేలపై గతంలో పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకునేవారు. భోగి పండగకు ముందు వరకు కోడి పందేల నిర్వహణకు వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. కోళ్లకు కత్తులు కట్టేవారిని బైండోవర్లు చేశారు. కానీ.. కొందరు నేతలు, పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో.. పోలీసులు సైలెంట్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఈసారి ఏపీలో సంక్రాంతి వేరే లెవల్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.

# అన్నదాత సుఖీభవ పంపిణీకి ఏర్పాట్లు

**గుంటూరు, జనవరి 7, పెన్ పవర్:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్కీమ్ అమలుకు సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఏపీలో కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీల్లో ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం అప్డేట్ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో రైతులకు శుభవార్త చెప్పింది. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇటీవల కేబినెట్ లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తుంది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కిసాన్ నిధులు తరహాలో మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని భావిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం నిధులు విడుదల చేస్తుంది, రాష్ట్ర ప్రభుత్వం ఎంత విడుదల చేయాలని విషయాలపై చర్చిస్తుంది. త్వరలోనే అన్నదాత సుఖీభవ విధి విధానాలను ఖరారు చేసి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 4,500 కోట్లను కేటాయించారు. అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది మే నెలలో విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇటీవల నరసాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు మే నెలలోనే రూ.20 వేలు అందిస్తుందన్నారు. వైసీపీ హయాంలో రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట కేంద్రం ఏటా అందించే రూ.6 వేలకు మరో రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 అందించేవారు. ఎన్నికల హామీల్లో ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి పార్టీలు ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఈ హామీ అమలుపై దృష్టి సారించింది. మూడు విడతల్లో రూ. 20 వేలు సాయం అందించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరిట పోర్టల్ ప్రారంభించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ నిధులు రూ.6 వేలకు మరో 14 వేలు కలిపి రూ.20 వేలు అందించనున్నారు

# గంజాయిపై ఉక్కుపాదం

**విశాఖపట్టణం, జనవరి 7, పెన్ పవర్:** ఏపీలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి తోట కనిపిస్తే కొట్టేయండి లేదా కాల్చేయండి అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాసాగు చేస్తున్న 8 ఎకరాల గంజాయి తోటల్ని అధికారులు ధ్వంసం చేశారు. అల్లూరి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని పోలీసులు చెబుతున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు కనిపించినా, గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసినా, డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించినా వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు డ్రోన్లు, టెక్నాలజీ వినియోగించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పెదబయలు మండలంలోని కంతుర్లకు చేరుకున్న అధికారులు డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సాగు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు పాతపాడు గ్రామంలో 8 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి (కానబిస్) తోటను ధ్వంసం చేశారు. జిల్లాలో కొన్ని రోజుల కిందట సైతం డ్రోన్ల ద్వారా పలుచోట్ల గంజాయి సాగు గుర్తించిన అధికారులు తోటల్ని ధ్వంసం చేశారు. ఇది అక్రమ సాగు నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్. ఈ ఆపరేషన్లో డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేవలు, o1 టూల్స్ ను ఉపయోగించి ఈ గంజా సాగులను గుర్తించి, వాటిని నాశనం చేయడంలో సహకరించాయని రవికృష్ణ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 2,000 ఎకరాలను డ్రోన్ సర్వే బృందం పర్యవేక్షించింది. డ్రోన్ల ద్వారా గంజాయి సాగును గుర్తించి, గంజాయి తోటల్ని నాశనం చేయడం తమ లక్ష్యమన్నారు. అనంతరం వ్యక్తిగతంగా పాతపాడు గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి సాగువల్ల కలిగే దుష్ప్రరిణామాలు వివరించారు. వీటి కేసులలో ఇరుక్కుని జైలుకు వెళితే జీవితం నాశనం అవుతుందని వారికి నష్టాలపై అవగాహన కల్పించారు. గిరిజనులు చేసే గంజా సాగు వల్ల గ్రామంతో పాటు సమాజం భవిష్యత్తుకు ఏర్పడే హానిని ప్రస్తావించారు. గిరిజనులు, గ్రామస్తులు ఇక నుంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రతిజ్ఞ చేయించారు. వారికి ప్రత్యామ్నాయ పంటలను అందించడానికి పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖలు సాయం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ ఏడాది పాతపాడులో కింగ్ బీన్స్, రాజ్మ, మిల్లెట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను అందజేసినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు పోలీస్ విభాగం, స్థానిక గ్రామాలతో కలిసి మరింత శాశ్వతమైన, చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతుల వైపు మారేందుకు సహాయం చేస్తామన్నారు. మెరుగైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని వారికి సూచించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ నాగేశ్ బాబు, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ ప్రమోద్, డీఈవో బ్రహ్మాజీరావు, ఫారెస్ట్ అధికారులు, జల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాను ఎలా ఓడించాలో మాకు బాగా తెలుసు..: దక్షిణాఫ్రికా పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** పదేళ్ల తరువాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెచుకున్న ఆస్ట్రేలియా.. వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ (%ౌబిజ%) ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఇంగ్లాండ్‌లోని ఐకానిక్ లార్డ్స్ వేదికగా ఇరు జట్లు గద కోసం పోరాడనున్నాయి. ఈ క్రమంలో కమ్మిన్స్ సేనకు సఫారీ పేసర్ రబడా హెచ్చరికలు పంపాడు. ఆస్ట్రేలియాను ఎలా ఓడించాలో తమకు బాగా తెలుసని అన్నాడు."దక్షిణాఫ్రికా %జం% ఆస్ట్రేలియా.. ఇరు జట్ల మధ్య ఎప్పుడూ తీవ్రమైన పోటీ ఉంటుంది. మైదానంలో ఇరు జట్ల ప్లేయర్లు ఒకేలా కష్టపడతారు. మ్యాచ్‌పై పైచేయి సాధించాలన్న కసి ప్రతి సంధర్భంలోనూ కనిపిస్తుంది. వారిపై ఎలా ఒత్తిడి పెంచాలో మాకు తెలుసు.. వారిని ఎలా ఓడించాలో కూడా మాకు తెలుసు.." అని రబాడ అన్నాడు.

దక్షిణాఫ్రికా గత ఏడాదిలో తమ ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. స్వదేశంలోపాటు విదేశీ సిరీస్‌లను గెలుచుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేరాలంటే తొలి టెస్టులో పాకిస్థాన్‌ను ఓడించాలి. కానీ, ఏకంగా వైట్ -వాష్ చేసి మన పొరుగు దేశపు జట్టు(పాకిస్థాన్)ను స్వదేశానికి పంపింది. అయితే, కంగారూలను ఓడించడం రబాడ అనుకున్నంత సులభం కాదు. %ౌబిజ% డిఫెండింగ్ ఛాంపియన్.. ఆసీస్. ఇంగ్లండ్ పిచ్‌లపై వారికున్నంత అవగాహన మరే పర్యాటక జట్టుకు ఉండదు. బ్యాక్-టు-బ్యాక్ టైటిల్స్ గెలిచిన మొదటి జట్టుగా అవతరించే అవకాశాన్ని కంగారూలు అంత ఈజీగా వదిలిపెట్టరు.

రెండు జట్లలోనూ ప్రపంచ స్థాయి పేసర్లు ఉండడంతో డబ్ల్యూటీసీ ఫైనల్ పోరు ఆసక్తికరంగా సాగనుంది. దక్షిణాఫ్రికా బౌలింగ్ విభాగానికి కగిసో రబడా నాయకత్వం వహిస్తుండగా.. ఆసీస్ పేస్ విభాగానికి ఆ జట్టు సారథి పాట్ కమిన్స్ నేతృత్వం వహిస్తున్నాడు.

**అగ్రస్థానంలో సఫారీ జట్టు**

ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(%ౌబిజ%) సైకిల్‌లో 69.44 శాతం విజయాలతో ప్రొటీస్ జట్టు టేబుల్-టాపర్‌గా కొనసాగుతుండగా.. 63.730 విజయాలతో ఆస్ట్రేలియా రెండవ స్థానంలో ఉంది. ఇక బోర్డర్- గవాస్కర్ ట్రోఫీని 1-3తేడాతో చేజార్చుకున్న టీమిండియా 50 శాతం విజయాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# ఇంతకీ మహ్మద్ షమీ ఏమైపోయాడు?: రవిశాస్త్రి

- 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ
- గాయంతో బాధపడుతూ ఎన్.సి.ఏలో రిహాబిలిటేషన్
- షమీ ఇప్పుడెక్కడున్నాడు అంటూ రవిశాస్త్రి వ్యాఖ్యలు
- తానైతే షమీని కూడా ఆసీస్ టూర్ కు ఎంపిక చేసేవాడ్నని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో అగ్రశ్రేణి పేసర్ గా ఎదిగిన మహ్మద్ షమీ... 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత గాయం బారినపడి పెద్దగా అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. షమీకి తగిలిన గాయం ఏంటో, అతడు ఎందుకు ఇన్నాళ్లు జట్టుకు దూరంగా ఉన్నాడో స్పష్టత లేదు. షమీ దేశవాళీ క్రికెట్ ఆడుతున్నా, ఫిట్ నెస్ లేదంటూ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి అతడ్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీనిపై టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి స్పందించారు. ఇంతకీ షమీ ఏమైపోయాడు అని ప్రశ్నించారు. షమీకి ఏమైందన్న విషయంపై మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చూసి తాను ఆశ్చర్యపోయానని వెల్లడించారు. షమీ ఎక్కడున్నాడు? గాయం నుంచి కోలుకున్నాడా? జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లిన షమీ అక్కడ ఎన్ని రోజులు ఉన్నాడు? ఎందుకు షమీ గురించి సరైన సమాచారం బయటికి రావడంలేదు అని రవిశాస్త్రి ప్రశ్నించారు. ఒకవేళ తనకే అధికారం ఉండుంటే, ఆస్ట్రేలియా టూర్ కోసం ఎంపిక చేసిన టీమిండియాలో షమీని కూడా చేర్చేవాడినని అన్నారు. అతడు కోలుకోకపోతే జట్టుతో పాటే ఉంటూ రిహాబిలిటేషన్ జరిగేలా చూసేవాడినని వివరించారు. షమీకి ఎంతో అనుభవం ఉందని, ఆస్ట్రేలియా టూర్ కు అతడ్ని కూడా ఎంపిక చేసి ఉంటే టీమిండియా బౌలింగ్ విభాగం చాలా బలంగా ఉండేదని అభిప్రాయపడ్డారు.

# ఛాంపియన్స్ ట్రోఫీకి వైస్ కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్!

**స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు!**
**బీసీసీఐ సెలక్టర్లు యోచిస్తున్నట్టుగా కథనాలు**
**బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అదరగొట్టిన బుమ్రా**
**రెండు మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గానూ రాణించి ఆకట్టుకున్న స్టార్ పేసర్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఆరంభానికి సమయం దగ్గరపడుతోంది. పాకిస్థాన్, దుబాయ్ వేదికగా వచ్చే నెలలో ఈ మెగా టోర్నీ జరగనుంది. భారత జట్టుని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మరికొన్ని రోజుల్లోనే ప్రకటించనుంది. జట్టు సారథిగా రోహిత్ శర్మ ఖరారైనట్టు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, వైఎస్ కెప్టెన్‌గా ఎవర్ని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ క్రికెట్ వర్గాల్లో నెలకొంది.భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వెన్నునొప్పి గాయం నుంచి కోలుకుంటే వైస్ కెప్టెన్‌గా సెలక్టర్లు ఎంపిక చేస్తారని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొంది. పరిమితి ఓవర్ల క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా బుమ్రాను పరిగణనలోకి తీసుకున్న సందర్భాలు చాలా తక్కువ కావడంతో ఈ తాజా కథనం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ హయాంలో వన్డే, టీ20 జట్లకు హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించేవాడు. కొన్నిసార్లు కేఎల్ రాహుల్ కూడా ఆ బాధ్యతలు నిర్వహించాడు. అయితే, కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక వన్డేలు, టీ20లలో వైస్ కెప్టెన్ బాధ్యతలను శుభ్‌మాన్ గిల్‌కు అప్పగిస్తున్నారు. అయితే, ఇటీవల ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుత వ్యక్తిగత ప్రదర్శనతో పాటు రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించి రాణించిన బుమ్రాకు ఛాంపియన్స్ ట్రోఫీలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని సెలక్టర్లు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాలో భారత్ గెలిచిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు అతడే సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే.కాగా, ఆస్ట్రేలియాతో జరిగిన చివరి టెస్టులో గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులోకి రావడం దాదాపు ఖాయమే. ఆ సమయానికి కోలుకోనున్నాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు అందుబాటులోకి రావడంపై ఇంకా స్పష్టత రాలేదు.

# 'గోట్' సినిమా వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లా

**సీరత్ కపూర్ స్టైల్ కూడా ఆమెలాగే చాలా మధురంగా ఉంటుంది**





టాలీవుడ్ లో ఇప్పుడు మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఓవైపు స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు యంగ్ హీరోల సరసన హీరోయిన్ గా చేస్తోంది. గతేడాది అర డజను చిత్రాలతో అలరించిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్ట్స్ లో నటిస్తోంది. ఆమె నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా సంక్రాంతి పండగకు విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి మాట్లాడుతూ 'ది గోట్' సినిమా తర్వాత తనపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయని, దాంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాయని తెలిపింది.లేటెస్ట్ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి తన జీవితంలోని కష్టమైన అధ్యాయాన్ని పంచుకుంది. తలపతి విజయ్ సరసన హీరోయిన్ గా నటించిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' విడుదలైన తర్వాత ఆన్‌లైన్‌లో ఆమెను చాలా ట్రోల్ చేసారని వెల్లడించింది. "గోట్ సినిమాలో నటించిన తర్వాత, నన్ను చాలా మంది ట్రోల్ చేశారు. అవి చూసి ఎంతో బాధపడ్డాను. నేను ఒక వారం పాటు డిప్రెషన్ లోకి వెళ్ళాను. కానీ 'లక్కీ భాస్కర్' చిత్రంతో నాకు మంచి ప్రశంసలు వచ్చాయి. ఇప్పటి నుండి నేను మంచి సినిమాలు చేయడంపైనే దృష్టి పెట్టాలని అప్పుడే గ్రహించాను" అని మీనాక్షి తెలిపింది.వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ద్విపాత్రిభినయం చేసిన యాక్షన్ థ్రిల్లర్ "ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్"(ది గోట్). ఇందులో మీనాక్షి చౌదరి, స్నేహ, ప్రభుదేవా, ప్రశాంత్, లైలా కీలక పాత్రలు పోషించారు. కథానుగుణంగా సినిమాలో మీనాక్షి పాత్రను విజయ్ పాత్ర చంపేస్తుంది. మీనాక్షి క్యారక్టర్ కు ఎక్కువ స్పేస్ కూడా లేదు. తొలి రోజే మిశ్రమ స్పందన తెచ్చుకున్న ఈ చిత్రం.. విజయ్ స్టార్ పవర్ తో బాక్సాఫీస్ వద్ద గట్టెక్కింది. 440 455.63 కోట్ల వసూళ్లతో 2014లో అత్యధిక కలెక్షన్స్ సాధించిన తమిళ చిత్రంగా నిలిచింది. అయితే ఈ సినిమా తర్వాత తనపై బాగా ట్రోలింగ్ జరిగినట్లుగా మీనాక్షి చెబుతోంది.ఇకపోతే 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో విక్టరీ వెంకటేష్ తో కలిసి నటిస్తోంది మీనాక్షి చౌదరి. ఇదొక ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్ ల మధ్య జరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్టైనర్ గా ప్రచారం చేయబడుతోంది. ఇందులో పోలీసాఫీసర్ గా, వెంకీ మాజీ ప్రేయసిగా మీనాక్షి కనిపించనుంది. పోలీస్ క్యారక్టర్ చేయాలనేది తన డ్రీమ్ అని, కెరీర్ తొలినాళ్లలోనే అలాంటి పాత్ర చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఎంటర్టైనింగ్ గా సాగే కాప్ రోల్ నటించడం కొత్త అనుభూతిని పంచిందని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఇందులో మీనాక్షితో పాటుగా మరో హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ నటించింది. వెంకటేష్ భార్యగా, నలుగురు పిల్లల తల్లి పాత్రలో ఐశ్వర్య కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సాంగ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సంక్రాంతికి తప్పకుండా సక్సెస్ సాధిస్తుందని నిర్మాత దిల్ రాజు ధీమాగా ఉన్నారు. 2025 జనవరి 14న తేదీన ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇక మీనాక్షి చౌదరి ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగ ఒక రాజు' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

**కృతి సనన్ లేటెస్ట్ లుక్ ఫ్యాషన్ హిట్**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com